కడప ఎంపీ స్థానానికి ఎవరికెన్ని ఓట్లంటే..



కడప(కలెక్టరేట్), జూన్ 6: సార్వత్రిక ఎన్నికల సమరం ముగిసింది. విజేతలెవరే తేలి పోయింది. అయితే.. నువ్వా నేనా అన్నట్లుగా కడప ఎంపీ స్థానానికి పోటీ జరిగింది. బరిలో వైసీపీ నుంచి సిట్టింగ్ ఎంపీ అవినాశ్‌రెడ్డి, టీడీపీ నుంచి భూపేశ్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి జగన్ సోదరి షర్మిల దిగడంతో.. ఈ స్థానంపై అందరిలో ఆసక్తి నెలకొంది. ఎవరికి ఎన్ని ఓట్లు వస్తాయో అని అందరూ ఎదురుచూశారు. కడప పార్లమెంట్ స్థానానికి మొత్తం 14 మంది పోటీ చేశారు. మొత్తం 13,23,510 ఓట్లు పోలయ్యాయి. 21,642 పోస్టల్ బ్యాలెట్ ఓట్లను ఉద్యోగులు వినియోగించుకున్నారు. వైసీపీ అభ్యర్థి వైఎస్ అవినాశ్‌రెడ్డి 6,05,143 ఓట్లు, టీడీపీ అభ్యర్థి సి.భూపేశ్‌రెడ్డి 5,42,448 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి, పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డి 1,41,039 ఓట్లు సాధించారు. మిగతా11 మంది అభ్యర్థులూ కలసి 22,199 ఓట్లు సాధించారు. మొత్తం మీద 1535 ఓట్లు తిరస్కరణకు గురికాగా.. పార్టీల అభ్యర్థులు నచ్చక నోటాకు 16,846 మంది ఓట్లు వేయడం గమనార్హం. నియోజక వర్గాల వారీగా అభ్యర్థులకు పోలైన ఓట్ల వివరాలను పరిశీలిస్తే..

- వైసీపీ అభ్యర్థి వైఎస్ అవినాశ్‌రెడ్డికి బద్వేలు నియోజకవర్గంలో 91,211, కడపలో 62,015, పులివెందులలో 1,08,134, కమలాపురంలో 75,232 ఓట్లు వచ్చాయి. అలాగే జమ్మలమడుగులో 96,996, ప్రొద్దుటూరులో 83,233, మైదుకూరులో 81,585, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 6,737 కలిపి మొత్తం 6,05,143 ఓట్లు వచ్చాయి.
- టీడీపీ అభ్యర్థి చదిపిరాళ్ల భూపేశ్‌రెడ్డికి బద్వేలులో 62,342, కడపలో 66,090, పులివెందులలో 47,757, కమలాపురంలో 79,750, జమ్మలమడుగులో 1,02,318, ప్రొద్దుటూరులో 90,964 ఓట్లు వచ్చాయి. మైదుకూరులో 83,317, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 10,090 కలిపి 5,43,244 ఓట్లతో రెండో స్థానంలో నిలిచారు.
- కాంగ్రెస్ అభ్యర్థి వైఎస్ షర్మిలరెడ్డికి బద్వేలులో 10,552, కడపలో 52,132, పులివెందులలో 25,956, కమలాపురంలో 12,080, జమ్మలమడుగులో 6,079 ఓట్లు వచ్చాయి. ప్రొద్దుటూరులో 19,964, మైదుకూరులో 9,632, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 4,644 ఓట్లు కలిపి మొత్తం 1,41,039 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు.
- గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసిన 11 మంది అభ్యర్థుల్లో పందిటి గుర్రప్పకు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 20తో కలిపి 3,810, వేణుగోపాల్‌కు 70 పోస్టల్ బ్యాలెట్ ఓట్లను కలిపి మొత్తం 3,570 ఓట్లు వచ్చాయి. సి.గోపాలక్రిష్ణారెడ్డికి 16 పోస్టల్ బ్యాలెట్ ఓట్లను కలిపి 2,430 ఓట్లు, కుంచం వెంకటసుబ్బారెడ్డికి 4 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కలిపి మొత్తం 2,333 ఓట్లు, ఖాజాహుసేన్‌కు 1 పోస్టల్ బ్యాలెట్ ఓటు కలిపి 1088 ఓట్లు, అంకిరెడ్డి సురేశ్ రెడ్డికి 3 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కలిపి మొత్తం 755 ఓట్లు వచ్చాయి. కాకర్ల షణ్ముగ రెడ్డికి 14 పోస్టల్ బ్యాలెట్ ఓట్లను కలిపి 647 ఓట్లు, పల్లె రమేశ్‌కు 5 పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో కలిపి 624 ఓట్లు, చాన్ బాషాకు 7 పోస్టల్ బ్యాలెట్లతో కలిపి 439, జేవీ రమణకు 20 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కలిపి మొత్తం 434 ఓట్లు, ఎం.హనుమంతరెడ్డికి 11 పోస్టల్ ఓట్లతో కలిపి మొత్తం 369 ఓట్లు వచ్చాయి. కాగా తమదే ఓటు అంటూ సవాల్ చేస్తూ 549 మంది టెండరు ఓట్లు వేయడం గమనార్హం. ఈ మేరకు జిల్లా ఎన్నికల అధికారి, లోక్‌సభ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ విజయరామరాజు ఒక ప్రకటన విడుదల చేశారు.

వైసీపీ కోట బద్దలు

- నలుగురు వైసీపీ అభ్యర్థులకు హ్యాట్రిక్ మిస్
- టీడీపీ దెబ్బకు వైసీపీ కుదేలు

కడప జిల్లా జగన్ అడ్డా.. వైఎస్ అడ్డా.. మేం తోపులం.. పులులం.. మేం చెప్పిందే వేదమంటూ కొందరు ఎమ్మెల్యేలు అధికారం అడ్డుపెట్టుకుని హత్యలు, కబ్జాలు, దందాలకు పాల్పడ్డారు. ప్రత్యర్థులపై కేసులు పెట్టారు. మీడియాను దూషించారు. అడ్డగోలుగా సంపాదించుకున్న సొమ్ముతో అందరిపై విరుచుకుపడ్డారు. అయితే కీలు ఎరిగి వాత పెట్టినట్లు జనం అవకాశం చూసి ఎగిరెగిరి పడ్డ వైసీపీ నేతలకు రాజకీయ సమాధి చేశారు. జనం తీర్పుతో నలుగురు వైసీపీ ఎమ్మెల్యేలు హ్యాట్రిక్ మిస్ అయ్యారు. ఇప్పటికే రెండుసార్లు అవకాశం ఇచ్చాం, ఇక మీ సేవలు చాలంటూ.. ఎగిరెగిరి పడ్డ ఎమ్మెల్యేలకు హ్యాట్రిక్ లేకుండా బైబై అంటూ సెండాఫ్ ఇచ్చారు. గత రెండు ఎన్నికల్లోనూ ఏడుకు ఏడు అసెంబ్లీ స్థానాలను క్లీన్ స్వీప్ చేసి దూకుడుమీదున్న వైసీపీ కంచుకోటను టీడీపీ బద్దలు కొట్టింది.

(కడప-ఆంధ్రజ్యోతి): కడప జిల్లా నిన్నటి దాకా వైఎస్ కుటుంబానికి అడ్డా అనే పేరుండేది. ఎందుకంటే.. గత 20 ఏళ్లుగా జిల్లా జనాలు వైఎస్ కుటుంబాన్ని అంతగా మోశారు. 2004లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎం అయ్యారు. ఆయన హయాంలో కాస్తో కూస్తో జిల్లా అభివృద్ధికి పునాది పడింది. దీంతో మరింత అభివృద్ధి కోసం 2009లో కూడా జనం వైఎస్‌నే అందలం ఎక్కించారు. ఇక ఆయన మరణానంతరం జగన్ కాంగ్రెస్‌ను వీడి 2011లో వైసీపీని స్థాపించి ఎంపీకి పోటీ చేసినా, ఉమ్మడి జిల్లాలో జగన్ పిలుపు మేరకు కాంగ్రెస్‌కు పలువురు ఎమ్మెల్యేలు రాజీనామా చేసి పోటీ చేసినా అప్పట్లో జనమంతా జైజగన్ అన్నారు. ఢిల్లీకి కడప పౌరుషం తెలాలి అంటూ జనాల్లో ఎమోషన్లు రెచ్చగొట్టడంతో జిల్లావాసులు 5.40 లక్షల పైచిలుకు ఓట్లతో జగన్‌ను గెలిపించారు. ఇక 2014లో జగన్ సీఎం అవుతారని అందరూ ఓట్లు వేశారు. 2019లో ఒక్క చాన్స్ అంటూ జగన్ జనం వెంటబడ్డారు. అరే మన బిడ్డ ఒక్క చాన్స్ అంటున్నాడు.. మనోడు సీఎం అయితే కడప జిల్లా రూపురేఖలు మారిపోతాయి. మావాడే సీఎం అని గర్వంగా చెప్పుకోవచ్చంటూ పార్టీలకతీతంగా ఫ్యాను గుర్తుకు ఓట్లు గుద్దారు. అందుకే వన్‌సైడ్‌గా పది అసెంబ్లీ, రెండు పార్లమెంట్లు క్లీన్‌స్వీప్ చేసింది.
జిల్లావాసులు కట్టబెట్టిన అఖండ మెజార్టీని జగన్ అనుచరులు దుర్వినియోగం చేశారు. మారుమూల నుంచి కడప వరకు జిల్లా అంతా కబ్జాలకు అడ్డాగా మారింది. ఇక ప్రశ్నించేవారిపై కేసులు పెట్టడం, ఉద్యోగులపై దాడులు ఇలా అందరిపై జగన్ అండ్ కో టీం దాష్టీకానికి పాల్పడింది. సొంత జిల్లా వాసి జగన్ సీఎంగా ఉన్నాడనే భరోసా కంటే వైసీపీ అక్రమాలు చూసి ఎప్పుడెప్పుడు జగన్ పీడ వీడిపోతుందా అంటూ జనం ఎదురుచూశారు. సమయం చూసి బటన్ నొక్కి జగన్ ప్రభుత్వాన్ని గంగలో వేశారు. జన సునామీలో జగన్ అడ్డా అనుకున్న కడప జిల్లాలో కూడా వైసీపీ కొట్టుకుపోయింది. జగన్ సొంతూరు కావడంతో పులివెందులలో మాత్రమే ఓటర్లు మంచి మెజారిటీతో పట్టం గట్టారు. ఇక బద్వేలులోనూ వైసీపీ గెలిచింది. ఇక్కడ టీడీపీ నాయకత్వం తీరు కారణంగానే ఓటమి చెందిందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. మిగతా ఐదుచోట్ల వైసీపీ ఓడిపోయింది. 2014, 2019 ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యేలు ఈసారి ఓటమితో ఖంగుతిన్నారు. అధికారం అడ్డుపెట్టుకుని అధికార మదంతో ముఖ్యంగా 2019 నుంచి 2024 వరకు శాసించిన ఎమ్మెల్యేలు ఇప్పుడు మాజీలు అయిపోయి గోర్లు గిల్లుకుంటున్నారు. కర్నుడి చావుకు కారణాలెన్నో అన్నట్లు- ఇక్కడ నలుగురు వైసీపీ ఎమ్మెల్యేలు హ్యాట్రిక్ విజయం కోల్పోవడానికి కూడా అనేక కారణాలు..

కడపలో..



అంజద్‌బాషా కార్పొరేటరుగా రాజకీయ ఆరంగేట్రం చేశారు. 2014 ఎన్నికల్లో 2019 ఎన్నికల్లో వైసీపీ ఎమ్మెల్యేగా గెలిచారు. జగన్ ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా పనిచేశారు. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో భూకబ్జాలు, దందాలు, సెటిల్‌మెంట్లు విచ్చలవిడిగా జరిగాయి. కడప నగరాన్ని అంజద్ బాషా, మేయరు సురేశ్‌బాబు, రవీంద్ర నాథరెడ్డి, మల్లికార్జునరెడ్డి వర్గీయులు కలిసి.. ప్రాంతాల వారీగా విభజించుకుని భూదందాలు, సెటిల్ మెంట్లకు పాల్పడ్డారనే విమర్శలున్నాయి. ఆ నలుగురి దందాలు, దౌర్జన్యాలను భరించలేని జనం వైసీపీకి సమాధి కట్టాలని డిసైడ్ అయ్యారు. తొలిసారిగా టీడీపీ నుంచి మహిళా అభ్యర్థి ఆర్.మాధవీ రెడ్డి బరిలో దిగారు. జనం మార్పు కోరుకున్నారు. 20 ఏళ్ల తరువాత కడపలో పచ్చజెండా ఎగిరింది. 2014, 2019 ఎన్నికల్లో గెలిచి.. ఈ పర్యాయం హ్యాట్రిక్ విజయం కోసం ఎదురు చూసిన అంజద్ బాషాకు ఓటమి తప్పలేదు.

ప్రొద్దుటూరులో..



ప్రొద్దుటూరు గోల్డ్ బిజినెస్‌కు సెకండ్ బాంబే. అలాంటి పట్టణాన్ని రాచమల్లు ఆధ్వర్యంలో జగన్ పాలనలో అరాచకాలకు అడ్డాగా మార్చారనే విమర్శ ఉంది. 2014, 2019 ఎన్నికల్లో రాచమల్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఈసారి కూడా ఆయనే పోటీ చేశారు. అయితే వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రొద్దుటూరులో భారీస్థాయిలో దందాలు, దౌర్జన్యాలు, అక్రమాలు, హత్యలు జరిగాయి. బీసీ నేత నందం వెంకటసుబ్బయ్యను జనం, అధికారుల సాక్షిగా దారుణంగా నరికి చంపారు. ఇక రాచమల్లు ప్రసాదరెడ్డి అయితే ఆయనకు నచ్చని మీడియాను, రాజకీయ నాయకులను బండబూతులు తిడతారు. ఆయనేదో మహాత్మాగాంధిగా కవరింగ్ ఇచ్చుకుంటారు. ఈయన పాలనలో జరిగిన అరాచకాలు భరించలేక జనం రాచమల్లు హ్యాట్రిక్ గెలుపును అడ్డుకున్నారు. పెద్దాయనగా పిలుచుకునే నంద్యాల వరదరాజులరెడ్డికి తిరిగి పట్టం కట్టారు.

కమలాపురంలో..



జగన్ మేనమామ రవీంద్ర నాథరెడ్డి సొంతూరు అనంతపురం జిల్లా. ఈయన కడపకు వచ్చి సెటిల్ అయ్యారు. మొదట సీకేదిన్నె జడ్పీటీసీగా గెలిచారు. కడప తొలివేయరుగా పనిచేశారు. కడప నుంచి అసెంబ్లీకి పోటీ చేయాలనేదే ఆయన లక్ష్యం అంటారు. అయితే రాజకీయ సమీకరణల్లో భాగంగా ఆయనను పొరుగున ఉన్న కమలాపురానికి పంపించారు. అక్కడ జనం కూడా 2014, 2019 ఎన్నికల్లో రవీంద్రనాథరెడ్డిని గెలిపించారు. ఈసారి ఆయనకు టికెట్ వస్తుందో రాదోనంటూ రకరకాలుగా ప్రచారం జరిగింది. చివరికి జగన్ ఆయనకు టికెట్ ఇచ్చారు. హ్యాట్రిక్ కొడుతున్నారంటూ ఆయన వర్గీయులు భావించారు. అయితే జనం బైబై అంటూ హ్యాండ్ ఇచ్చి తొలిసారి టీడీపీ నుంచి పోటీ చేసిన పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డిని గెలిపించారు. రవీంద్రనాధరెడ్డి హయాంలో భారీ భూకబ్జాలు జరిగాయని చెబుతారు. ప్రభుత్వ భూములను ఆయన అనుచరులు సొంత ఆస్తులుగా మార్చుకున్నారంటారు. ఇక వైసీపీకి చెందిన భూములనే మింగేశారనే అపవాదు వచ్చింది. సొంత కేడరును గాలికి వదిలేయడం, కొప్పర్తిలో చేసే అభివృద్ధి పనులను ఆయన కొడుకు చేపట్టడం కేడరులో అసంతృప్తికి కారణమంటారు. అలాగే సర్వరాయసాగర్ నీళ్ల రైతుల సాగుకు కాకుండా ఆయన చేపలచెరువులకు వాడుకోవడం కూడా పెద్ద మైనస్‌గా మారింది. 2019లో రవిరెడ్డి కోసం చొక్కాలు చింపుకుని పనిచేసిన కేడరు ఈ సారి హ్యాండ్సప్ అయిందంటారు. దీంతో ఆయన కూడా వరుసగా మూడోసారి గెలుపొందే అవకాశాన్ని కోల్పోయారు.

మైదుకూరులో..

మైదుకూరులో వైసీపీ నుంచి పోటీ చేసిన శెట్టిపల్లె రఘురామిరెడ్డి సైతం హ్యాట్రిక్ విజయం మిస్ అయ్యారు. టీడీపీ నుంచి ఈయన 1985లో పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. చాలాకాలం టీడీపీలో కొనసాగిన ఆయన అనంతర పరిణామాలలో వైసీపీలో చేరారు. 2014, 2019 ఎన్నికల్లో మైదుకూరు వైసీపీ ఎమ్మెల్యేగా గెలిచారు. వాస్తవంగా రఘురామిరెడ్డి అంటే సౌమ్యుడనే పేరుంది. ఎవరినీ దూషించడం కానీ, దుర్భాషలాడడం కానీ చేయడంటారు. జగన్ సీఎం అయిన తరువాత రఘురామిరెడ్డి హయాంలో మైదుకూరు నియోజకవర్గంలో ఆయన అనుచరులు భారీ స్థాయిలో భూకబ్జాలకు పాల్పడినట్లు విమర్శ ఉంది. రఘురామిరెడ్డిపైనే ఆరోపణలు వచ్చాయి. పనుల్లో పర్సంటేజీలు తీసుకునే వారని, కబ్జాలకు పాల్పడిన తన అనుచరులకు కొమ్ముకాశారనే విమర్శలు మూటగట్టుకున్నారు. ఈ పర్యాయం జరిగిన ఎన్నికల్లో.. ఇదే తనకు చివరి ఎన్నిక అని విజ్ఞప్తి చేసినా ఓటర్లు ఆయనను తిరస్కరించారు. వరుసగా మూడోసారి అసెంబ్లీకి పంపకుండా ఇంటికే పరిమితం చేశారు. పుట్టా సుధాకర్‌యాదవ్‌కు జనం పట్టం కట్టారు.



ఉద్యోగ ఉపాధ్యాయుల ఓట్లు టీడీపీకే

- అత్యధికంగా మాధవీరెడ్డికి 3825 ఓట్లు

కడప (ఎడ్యుకేషన్), జూన్ 6: సార్వత్రిక ఎన్నికల్లో ఉద్యోగ ఉపాధ్యాయుల ఓట్లు ఎక్కువ భాగం టీడీపీకే లభించాయి. 2019 ఎన్నికల్లో వైసీపీకి అనుకూలంగా ఓట్లు వేసిన అనేక మంది ఈసారి టీడీపీకి (కూటమి అభ్యర్థులకు) మద్దతుగా నిలిచారు. పలుచోట్ల వైసీపీ కన్నా టీడీపీ అభ్యర్థులకు రెట్టింపు స్థాయిలో వచ్చాయి. కడప ఎమ్మెల్యేగా పోటీ చేసిన టీడీపీ అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డికి అత్యధికంగా 3825 ఓట్లు లభించాయి. అత్యంత తక్కువగా మైదుకూరు వైసీపీ అభ్యర్థి రఘురామిరెడ్డికి 712 మాత్రమే వచ్చాయి.
ఎన్నికల విధుల్లో కీలకమైన పోలింగ్ సిబ్బంది, రవాణా, విద్యుత్ పోలీసు వంటి అత్యవసర సర్వీసులైన శాఖల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం ఉంది. గతంలో ముందుగా ఎన్నికల అధికారికి దరఖాస్తు చేసుకుని బ్యాలెట్ పత్రాన్ని పొంది తమకు నచ్చిన వారికి ఓటు వేసి కవర్లు ఆర్వో కార్యాలయంలో ఇచ్చేవారు. ఆ సమయంలో పోటీలో ఉన్న అభ్యర్థులు పోస్టల్ బ్యాలెట్ ఓట్లను కొనుగోలు చేసి వారి సమక్షంలో ఓటు వేయించుకునేవారు. తరువాత సదరు కవరును ఆ ఉద్యోగి లేదా కొనుగోలు చేసిన పార్టీ తరపున వారు తీసుకెళ్లి ఆర్వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన బాక్సులో వేసేవారు. ఇది అధికారపార్టీకి అనుకూలంగా పనిచేసేది. అయితే ఈసారి ఎన్నికల సంఘం నిబంధనలు మార్చింది. పోస్టల్ బ్యాలెట్ కోసం ప్రత్యేకంగా మూడురోజుల పాటు నియోజకవర్గ కేంద్రాల్లో పోలింగ్ నిర్వహించింది. ఆ పరిధిలోని వారే కాక వేరే నియోజకవర్గంలో ఓటు ఉండి ఇక్కడ ఎన్నికల విధుల్లో ఉన్న వారు పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌లో పాల్గొనేలా చేశారు. పోస్టల్ బ్యాలెట్ కలిగిన వారిలో అత్యధికులు ఈసారి టీడీపీ అభ్యర్థులకే (కూటమి అభ్యర్థులకు) ఓటు వేశారు.

నియోజకవర్గాల వారీగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు

నియోజకవర్గం	కూటమి	వైసీపీ
కడప	3825	1247
ప్రొద్దుటూరు	2440	1049
బద్వేలు	1843	1039
జమ్మలమడుగు	1765	886
మైదుకూరు	1755	712
కమలాపురం	1309	606
పులివెందుల	1046	1564

కనిపించని డబ్బు ప్రభావం

పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో డబ్బు ప్రభావం ఏ మాత్రం లేదు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గ స్థానాలకు పోల్ అయిన పోస్టల్ బ్యాలెట్లలో వివిధ కారణాలతో కౌంటింగ్ సమయంలో కొన్ని తిరస్కరణకు గురయ్యాయి. అయితే టీడీపీ అభ్యర్థులకు ఎక్కువ పోస్టల్ బ్యాలెట్ ఓట్లు రావడం గమనార్హం. ఒక్క పులివెందులలో మాత్రమే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అధిక సంఖ్యలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వచ్చాయి. మిగిలిన ఆరు నియోజకవర్గాల్లోనూ కూటమి అభ్యర్థులకే ఎక్కువ వచ్చాయి. కడప, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, కమలాపురం, మైదుకూరు నియోజకవర్గాల్లో వైసీపీకంటే రెట్టింపు సంఖ్యలో కూటమి అభ్యర్థులకు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు రావడం విశేషం.



ఈసారైనా రాష్ట్రానికి న్యాయం చేయండి : తులసిరెడ్డి

వేంపల్లె, జూన్ 6: రాష్ట్రానికి ఈసారైనా న్యాయం చేయాలని కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబుకు కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ తులసిరెడ్డి విజ్ఞప్తిచేశారు. గురువారం వేంపల్లెలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర విభజన సందర్భంగా 2014లో నాటి కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నవ్యాంధ్రప్రదేశ్‌కు అనేక వరాలు ప్రకటించిందన్నారు. ప్రత్యేక హోదా, రాయలసీమకు, ఉత్తరాంధ్రకు బుందేల్‌ఖండ్ తరహా ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ అమలు, కడప జిల్లాలో ఉక్కు కర్మాగారం నిర్మాణం, దుగరాజపట్నం ఓడరేవునిర్మాణం, రాజధాని ఏర్పాటుకు నిదులు, పోలవరం జాతీయ ప్రాజెక్టు పూర్తి, విశాఖ మెట్రో రైలు, విజయవాడ మెట్రో రైలు, విశాఖ రైల్వేజోన్ తదితర అంశాలు ఉన్నాయన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఉంటే ఈ అంశాలన్నీ అమలు అయి ఉండేవన్నారు. సీమాంధ్ర స్వర్ణాంధ్ర అయి ఉండేదన్నారు. 2014, 2019లో బీజేపీకి పూర్తి మెజారిటీ ఉన్నకారణంగా మోదీ ప్రభుత్వం పట్టించుకోని కారణంగా అమలు కాలేదన్నారు. ప్రస్తుతం బీజేపీకి లోక్‌సభలో సొంతంగా మెజారిటీ లేదన్నారు. టీడీపీ మద్దతు తప్పనిసరి అన్నారు. కావున ఈసారైనా విభజన హామీలను సాధించాలని అన్నారు. అలాగే కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబుకు, నూతనంగా గెలిచిన అందరు ఎమ్మెల్యేలకు, పార్లమెంటు సభ్యులకు తులసిరెడ్డి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

కడపలో గేమ్ చేంజర్ అఫ్జల్‌ఖాన్

- కాంగ్రెస్‌కు 24,500 ఓట్లు
- వైసీపీ ఓటమికి ఆయనే కారణమంటూ ఏడుపులు

(కడప-ఆంధ్రజ్యోతి): అఫ్జల్‌ఖాన్ ఒకప్పుడు వైసీపీలో టైగర్ బ్రాండ్. ఏదైనా సరే గట్టిగా మాట్లాడతాడనే పేరుండేది. కమలాపురం మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డికి ఈయన అత్యంత సన్నిహితుడుగా ముద్ర ఉండేది. వైసీపీ నుంచి కడప అసెంబ్లీకి పోటీ ఉండే ప్రతిసారి ఈయన పేరు వినిపించేది. వైసీపీ మైనార్టీలకు మళ్లీ టికెట్ ఇస్తే ఈసారి అఫ్జల్‌ఖాన్‌కే టికెట్ అంటూ ఈయన వర్గీయులు భావించేవారు. సాక్షాత్తు జగన్ మేనమామ రవిరెడ్డి అనుచరుడు కావడంతో ఈయన టికెట్ పక్కా అని అనుకునేవారు. అయితే జగన్ ప్రతిసారీ ఈయనకు మొండిచేయి చూపారు. ఈ సారీ అదే పరిస్థితి. మళ్లీ అంజద్‌బాషాకే టికెట్ ఇచ్చారు. కష్టపడినా గుర్తింపు లేదనే బాధతో అఫ్జల్‌ఖాన్ వైసీపీకి టాటాచెప్పి కాంగ్రెస్‌లో చేరారు. అఫ్జల్‌ఖాన్ పోతే ఏమవుద్ది, ఆయన వల్ల ఓట్లేమీ రావు అంటూ అంజద్ బ్యాచ్ హేళన చేసింది. హైదరాబాదులో ఓ హోటల్‌లో అనుకోకుండా కడపకు చెందిన ఓ మిత్రుడితో కలిసిన ఫొటోలను కూడా అంజద్ అండ్ కో సోషల్ మీడియాలో పెట్టి ఈయన ప్యాకేజీ స్టార్ అంటూ ఎన్నికల తరువాత ట్రోల్ చేసింది. అయితే అఫ్జల్‌ఖాన్ ఎఫెక్ట్ ఏందో ఇప్పుడు అంజద్ అండ్ కో గ్యాంగ్‌కు పక్కాగా కనిపిస్తోంది. ఆయన కాంగ్రెస్ నుంచి పోటీ చేయడం వల్లనే తాము ఓడిపోయామంటూ ఇప్పుడు గగ్గోలు పెడుతుంది. ఓ విధంగా కడప అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన అఫ్జల్‌ఖాన్ గేమ్ చేంజర్ అని చెప్పవచ్చు.
కడప అసెంబ్లీ స్థానానికి 1,85,136 ఓట్లు పోల్ అయ్యాయి. టీడీపీ ఎమ్మెల్యే మాధవీకి 90,988 ఓట్లు వస్తే, వైసీపీ అభ్యర్థి అంజద్‌బాషాకు 72,128 ఓట్లు వచ్చాయి. ఇక కాంగ్రెస్ అభ్యర్థి అఫ్జల్‌ఖాన్‌కు 24,500 ఓట్లు వచ్చాయి. టీడీపీ అభ్యర్థి 18,860 ఓట్లతో గెలుపొందారు. మైనార్టీ ఓట్లన్నీ అఫ్జల్‌ఖాన్ చీల్చాడని అంజద్ శిబిరం మొత్తుకుంటోంది. వారి వేదన చూస్తే అఫ్జల్‌ఖాన్ కడపలో గేమ్ చేంజరే అనేది స్పష్టమవుతోంది.
టీడీపీ ఈ ఎన్నికల్లో బీజేపీతో పొత్తు పెట్టుకోవడంతో మైనార్టీ ఓటు బ్యాంకింగ్‌పై వైసీపీ గట్టి నమ్మకం పెట్టుకుంది. ఇక్కడంతా ఓటింగ్ వన్‌సైడే అని భావించింది. టీడీపీ అభ్యర్థి మాధవికి నాగరాజుపేట, ఎన్జీవోకాలనీ, నెహ్రూనగర్, చిన్నచౌకు ఇలా అన్ని చోట్ల భారీస్థాయిలో ఓట్లు పడ్డాయి. ముస్లింలు ఎక్కువగా ఉండే నకాశ్ ప్రాంతంలో ఓట్లంతా వన్‌సైడ్ అవుతుందని వైసీపీ నేతలు భావించారు. అయితే అక్కడ కూడా మైనార్టీలు ఉండే బూత్‌లలో మాధవీకి మెజార్టీ తగ్గలేదు. అక్కడ మాధవి, అంజాద్, అఫ్జల్‌ఖాన్‌కు ఓట్లు చీలినప్పటికీ మెజార్టీ మాధవీ వైపు వచ్చింది. అయితే వైసీపీ మాత్రం మైనార్టీ ఓట్లనే నమ్ముకుంది. హిందువుల ఓట్లలో టీడీపీకి 70 శాతం పడినా వైసీపీకి 30 శాతం ఓట్లు పోల్‌అయితే ఇక మైనార్టీ ఏరియా అంతా వన్‌సైడ్ వస్తుందని మైనార్టీ బూత్‌లలో కనీసం 10వేల మెజార్టీ ఉన్నాతామే గెలుస్తామని వైసీపీ ధీమా వ్యక్తం చేసింది. అనూహ్యంగా మైనార్టీలు ఉన్న చోట కూడా మాధవికి ఓట్లు వచ్చాయి. అఫ్జల్ ఖాన్‌కూ పడ్డాయి. ఈయనకు పడిన ఓట్లన్నీ వైసీపీవి అని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. మొత్తానికి అఫ్జల్‌ఖాన్ కడపలో గేమ్‌చేంజర్‌గా మారారు.



ఆయన హేళన చేయడంతో..
ఎన్నికల్లో పోటీ చేశా

- పార్టీ వీడితే.. అల్లుడికి లైన్‌క్లియర్ అంటూ సంబర పడ్డాడు
- వక్ఫ్, ప్రభుత్వ భూములను వదలలేదు
- మాజీ డిప్యూటీ సీఎంపై కాంగ్రెస్ నేత అఫ్జల్‌ఖాన్ మండిపాటు

కడప(కలెక్టరేట్), జూన్ 6: "వైఎస్ కుటుంబంతో ఎంతో అనుబంధం ఉన్నప్పటికీ నాకు వైసీపీలో టిక్కెట్ దక్కలేదు. దీంతో వైసీపీని వీడతానని ప్రకటించాను. ఈ విషయం తెలిసి అంజాద్ బాషా అహంకారంతో ఆయనకు 2500 ఓట్లు కూడా రావని హేళన చేశారు. దీనిని సవాలుగా తీసుకుని కాంగ్రెస్ తరఫున కడప అసెంబ్లీ స్థానానికి పోటీచేశా" అని అఫ్జల్ ఖాన్ తెలిపారు. గురువారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. కేవలం 15 రోజుల వ్యవధిలో ఎన్నికల్లో ప్రచారం చేశామని తనకు 24,500 ఓట్లు, పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డికి 1.41 లక్షల ఓట్లు వేసి జిల్లా ప్రజలు ఆదరించారన్నారు. తాను పార్టీ వీడే విషయాన్ని కడపలో ఓ ప్రముఖ వ్యాపారి అంజాద్ దృష్టికి తీసుకెళితే.. 2014లో మత గురువు మగ్దూం మౌలానాకు 3000 ఓట్లు వచ్చాయని, ఇతనికి 2500 ఓట్లు కూడా రావని అవహేళనగా మాట్లాడాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతే కాకుండా భవిష్యత్తు రాజకీయాల్లో తనకు, తన అల్లుడికి అడ్డు లేకుండా పోతుందని అహకారంతో వ్యవహరించాడన్నారు. దీంతో తన సత్తా తెలుసుకునేందుకే పోటీ చేశానన్నారు. ఎన్నికలో టీడీపీకి అమ్ముడు పోయానని అంజాద్ బాషా తనకు అనుకూలమైన పత్రికలో తప్పుడు ప్రకటనలు చేయడం బాధ కలిగించిందన్నారు.


మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత అఫ్జల్ ఖాన్

డబ్బుకోసం కక్కుర్తి పడే అలవాటు వాళ్లదేనని దుయ్యబట్టారు. ముస్లింలంతా ఒక్కటేనని, అయితే ఎన్నికల్లో లబ్ధి కోసం షేక్, సయ్యద్, పఠాన్ లంటూ విడగొట్టి ఓట్లు దండుకోవాలనే నీచానికి వడిగట్టాడని అన్నారు. అందుకే ప్రజలు ఈ ఎన్నికల్లో చిత్తు చిత్తుగా ఓడించి బుద్ధి చెప్పారన్నారు. కడపలో ముస్లిం మైనార్టీలకు నీవు చేసిందేమి లేదని అన్నారు. దర్గా, మసీదు, వక్ఫ్ ప్రభుత్వ భూముల కబ్జాలతో పాటు, రౌడీయిజం రియల్ ఎస్టేట్ కమీషన్లకు పాల్పడ్డారని అన్నారు. మత గురువులు, మైనార్టీలపై 49 తప్పుడు కేసులు పెట్టడమే కాక తనకు ముస్లిం ఓట్లు అవసరం లేదని అనడంతో ప్రజలు ఆయనకు గుణపాఠం చెప్పారన్నారు. తనను రాజకీయంగా ఎదగకుండా, పదవులు రాకుండా కుయుక్తులు పన్నాడని, అందుకే తిరుగుబాటు రుచి చూపానన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే మాధవీరెడ్డిని నీచాతి నీచంగా నీ తమ్ముడు అహమ్మద్ దూషించడం, దాన్ని నీవు సమర్థించడం వల్లనే కడప ప్రజలు నిన్ను తిరస్కరించారని అన్నారు. ప్రజల పక్షాన సమస్యల పరిష్కారానికి పోరాటం చేసి కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ మైనార్టీ ఉపాధ్యక్షుడు మహ్మద్ అలీఖాన్, ప్రసాద్ గౌడ్, ఆసీఫ్ ఖాన్, శ్రీనివాసులు, గంగయ్య, మామిళ్లబాబు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు జడ్పీ చైర్మన్ రాజీనామా

- ఇన్‌చార్జ్ చైర్మన్‌గా బాలయ్య...?
- ప్రత్యేక పరిస్థితుల మధ్య..
- నేడు స్టాండింగ్ కమిటీ సమావేశం
- ప్రశ్నార్థకంగా జడ్పీటీసీ సభ్యుల హాజరు

కడప(రూరల్), జూన్ 6: జిల్లా ప్రజాపరిషత్ (జడ్పీ) చైర్మన్ పదవికి, ఒంటిమిట్ట మండలం జడ్పీటీసీ పదవులకు ఆకేపాటి అమరనాథరెడ్డి శుక్రవారం రాజానామా చేయనున్నారు. ఈ మేరకు కలెక్టర్ విజయరామరాజును కలిసి రాజీనామా పత్రాన్ని అందజేయనున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేట ఎమ్మెల్యేగా అమరనాథరెడ్డి గెలుపొందారు. దీంతో ఆయన జడ్పీ చైర్మన్ పదవికి, జడ్పీటీసీకి రాజీనామా చేయాల్సి వచ్చింది. రాజీనామా అంశాన్ని గురువారం వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి వివరించారు. జగన్ సమ్మతితో రాజీనామా చేయబోతున్నారు. ఆయన స్థానంలో జడ్పీ వైస్‌చైర్మన్-2 గా ఉంటున్న పెండ్లిమర్రి జడ్పీటీసీ సభ్యుడు పిట్టు బాలయ్యకు ఇన్‌చార్జ్ చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించే అవకాశం కనిపిస్తోంది.

25 సెప్టెంబరు 2021న జడ్పీ చైర్మన్‌గా..

2019 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చింది. తదనంతరం 2021లో సెప్టెంబర్‌లో జడ్పీటీసీ ఎన్నికలను నిర్వహించారు. ఈ ఎన్నికలలో వైసీపీ పెద్దలు అధికారాన్ని అడ్డం పెట్టుకొని అప్పటి ఉమ్మడి కడప జిల్లాలోని 50 జడ్పీటీసీ స్థానాలలో 38 వాటిని ఏకగ్రీం చేసుకున్నారు. ఈమేరకు ఒంటిమిట్ట మండలం నుంచి ఏకగ్రీవంగా ఎన్నికైన ఆకేపాటి అమరనాథరెడ్డి జడ్పీ చైర్మన్‌గా సెప్టెంబర్ 25న ప్రమాణస్వీకారం చేశారు. నేడు తన పదవికి రాజీనామా చేయనున్నారు. చైర్మన్ పదవిలో రెండు సంవత్సరాల తొమ్మిది నెలల పాటు కొనసాగి పలు స్టాండింగ్ కమిటీ సమావేశాలను, జడ్పీ సర్వసభ్య సమావేశాలను నిర్వహించారు.

శుక్రవారం ఉదయం జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముందుగానే అమరనాథరెడ్డి జడ్పీ చైర్మన్ పదవికి రాజానామా చేయనున్నారు. ఈయన స్థానంలో ఇన్‌చార్జ్ జడ్పీ చైర్మన్ హోదాలో జడ్పీ వైస్ చైర్మన్-2 బాలయ్య సమావేశాన్ని నిర్వహించనున్నారు. గత సమావేశం వరకు జడ్పీ చైర్మన్ హోదాలో ఆకేపాటి అమరనాథరెడ్డి అధ్యక్షతన ప్రణాళిక మరియు ఆర్థికస్థాయి సంఘము, గ్రామీణాభివృద్ధి స్థాయి సంఘము, నిర్మాణపు పనుల స్థాయి సంఘము, విద్య మరియు వైద్యసేవల స్థాయి సంఘము సమావేశాలు నిర్వహించేవారు. ఇకనుంచి పై సమావేశాలను కూడా ఇన్‌చార్జ్ చైర్మన్‌గా ఎవరుంటే వారు నిర్వహించనున్నారు.

నేడు స్టాండింగ్ కమిటీ సమావేశం

జడ్పీటీసీల్లో కంగారు

రాష్ట్రంలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయి వారి ప్రభుత్వం దిగిపోవడంతో జడ్పీటీసీలలో కంగారు మొదలైంది. నిన్నటి వరకు వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండడంతో స్టాండింగ్ కమిటీ, జడ్పీ సర్వసభ్య సమావేశాలను వారికి అనుకూలంగా నిర్వహించుకుంటూ వచ్చారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నిర్వహించే జడ్పీ స్టాండింగ్ సమావేశానికి వైసీపీ ప్రభుత్వం దిగిపోవడంతో జడ్పీటీసీలు తాము అనుకున్న రీతిలో సాగవని భావించి కంగారు పడుతున్నారు.

శాఖల పనితీరుపై అర్థవంతమైన చర్చ సాగేనా...?

జడ్పీస్థాయి సంఘాల సమావేశాన్ని శుక్రవారం జడ్పీ సమావేశం హాలులో నిర్వహిస్తున్నారు. ఇప్ప టికి వరకు నిర్వహించిన సమావేశాల్లో ఏనాడూ ఆయా శాఖల పనితీరుపై పూర్తిగా అర్థవంతమైన చర్చ కొనసాగించలేదు. ఆయా కమిటీల చైర్మన్లు, సభ్యులు ఆడపాదడపా ప్రశ్నలతోనే సమావేశాన్ని సరిపుచ్చుతూ వచ్చారు. సమావేశాల పేరుతో కర్చులు మాత్రం తడిపి మోపెడవుతున్నాయి. ప్రణాళిక అండ్ ఆర్థిక స్థాయి, గ్రామీణాభివృద్ధి స్థాయి, విద్య మరియు వైద్యసేవల స్థాయి, నిర్మాణపు పనుల స్థాయి, స్త్రీ సంక్షేమ స్థాయి, వ్యవసాయ స్థాయి, సాంఘిక సంక్షేమ స్థాయి సంఘాల సమావేశాలను నిర్వహించారే కానీ.. వీటివల్ల ఎలాంటి ప్రయోజనం చేకూరలేదనే విమర్శలున్నాయి.



జడ్పీ సమావేశ భవనం

రైతులకు సకాలంలో అందని ఖరీఫ్ సాయం

ప్రస్తుతం 2024 ఖరీఫ్ ప్రారంభమైంది. నైరుతి రుతుపవనాలు కాస్త ముందుగానే ప్రవేశించి వర్షాలు ఆశాజనకంగా పడుతున్నాయి. అయినప్పటికి రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను నిన్నటి వరకు (జూన్ 4 వరకు) అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం సకాలంలో అందించలేక చేతులు ఎత్తేసింది. దీంతో రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. బ్లాక్ మార్కెట్‌లో ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కిలో పచ్చిమిర్చి రూ.130 నుంచి రూ.160ల వరకు అమ్ముతున్నారు. గ్రామాల్లో పారిశుధ్యపు పనులు సక్రమంగా కొనసాగడంలేదు. వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ప్రజలకు అందాల్సిన వైద్య సేవలు సక్రమంగా అందడంలేదు. పీహెచ్‌సీ కేంద్రాలలో మౌలిక వసతుల లేమి, సిబ్బంది కొరత వేధిస్తోంది. గ్రామీణ మంచినీటి సరఫరా పథకం నత్తనడకన సాగుతోంది. మట్టి మాఫియా, ఇసుక మాఫియా రాజ్యమేలుతుండడంతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. వీటన్నింటిపై సమీక్ష నిర్వహించి ప్రజలకు న్యాయం చేయాల్సిన గురుతర బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉంది. కానీ ఈ దిశగా స్టాండింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించకుండా మొక్కుబడిగా నిర్వహిస్తున్నారు. నేడు నిర్వహించే సమావేశమైనా పూర్తి స్థాయిలో నిర్వహించి ప్రజలకు సంబంధించిన సమస్యలపై చర్చించి తగు పరిష్కారం చూపుతారని ప్రజలు ఆశిస్తున్నారు.

వైసీపీ ఓటమితో షాక్‌లో జడ్పీటీసీ సభ్యులు

సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ రాష్ట్ర చరిత్రలో కనీవినీ ఎరుగని భారీ ఓటమిని చవిచూసింది. 2019 ఎన్నికల్లో 151 సీట్లు సాధించింది. ఇందులో ఉమ్మడి కడప జిల్లాలోని 10 ఎమ్మెల్యే స్థానాలను కైవశం చేసుకుంది. తదనంతరం జరిగిన జడ్పీటీసీ ఎన్నికల్లో కూడా టక్కుటమారం విద్యలను ప్రదర్శించి జిల్లాలోని 50 జడ్పీటీసీ స్థానాలకు గాను 49 వాటిని సొతం చేసుకుంది. దీంతో టీడీపీకి జడ్పీలో వాయిస్ లేకుండా పోయింది. అయితే ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ తుడిచుకుపెట్టుకుపోయింది.

ప్రతిపక్ష హోదా కూడా లేనంతగా 11 ఎమ్మెల్యే స్థానాలతో సరిపెట్టుకుంది. జిల్లాలో టీడీపీ గత 30 సంవత్సరాలలో ఎన్నడూ లేని విదంగా 7 ఎమ్మెల్యే స్థానాలను గెలుచుకొని వైసీపీ వెన్నులో వణుకు పుట్టించింది. దీంతో ఆయా మండలాల్లోని వైసీపీ జడ్పీటీసీ సభ్యులు షాక్‌లో ఉండిపోయారు. ఈ నేపథ్యంలో నేడు జరుగుతున్న స్టాండింగ్ కమిటీ సమావేశానికి జడ్పీటీసీ సభ్యుల హాజరు ప్రశ్నార్థకంగా మారింది.

మంగపట్నం చెరువుకు గండి

● తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే ఆది ● గండి పూడ్చిన అధికారులు



చెరువు గండి నుంచి వస్తున్న నీరు- పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

ముద్దనూరు జూన్ 6: మంగపట్నంలో భారీగా కురిసిన వర్షానికి పెద్ద చెరువుకు నీరు చేరి కట్టకు గండి పడింది. ప్రజలు నూతన ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఇరిగేషన్ అధికారులను పంపి గండి పూడ్చించారు. మంగపట్నంలో భారీ వర్షం కురిసింది. దీంతో కొత్తచెరువుకు కొండప్రాంతాల నుంచి భారీ ఎత్తున నీరు చేరింది. అక్కడి నుంచి పెద్దచెరువుకు వర్షపు నీరు రావడంతో కట్టబలహీనంగా ఉండడంతో గండి పడింది. దీంతో చెరువు నుంచి వస్తున్న నీరు గ్రామం వైపు రాకుండా దారి మళ్లించారు. వెంటనే ప్రజలు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఇరిగేషన్ అధికారులను పంపారు. వారు కట్టను పరిశీలించి గండి పడిన చోట మరమ్మత్తు చేయించేందుకు చర్యలు చేపట్టారు.

పెద్దచెరువు తెగితే ఊర్లోకి నీళ్లు వస్తాయి

- జనార్ధన్‌నాయుడు, గ్రామస్థుడు, మంగపట్నం

పూర్వం కొత్తచెరువు తెగిపోయి మంగపట్నం గ్రామం నీటి మునిగింది. అప్పట్లో పెద్దలు ఊరిలోకి నీరు రాకుండా గ్రామం పైభాగాన పెద్దచెరువును సొంత పొలాల్లో కట్ట ఏర్పాటు చేసుకున్నారు. కట్ట తెగిన వంక ద్వారా నీరు వెళతుండేది. ప్రస్తుతం ఊరి వైపు కట్ట బలహీనమై గండి ఏర్పడింది. నూతన ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో అధికారులను పంపి మరమ్మతు చేయించారు. వర్షాలు భారీగా కురుస్తున్నాయి. దీంతో ఏప్రమాదమైన ఊరికి పొంచి ఉండేది.

కొండాపురంలో కుండపోత వర్షం

చిన్నపల్లెలో ఇళ్ల చుట్టూ చేరిన వర్షపు నీరు



కొండాపురం మండలం చిన్నపల్లె గ్రామం ఇళ్ల చుట్టూ చేరిన వర్షపు నీరు

కొండాపురం, జూన్ 6: మండలంలో బుధవారం రాత్రి కుండపోత వర్షం కురిసింది. దీంతో మండలంలో వాగులు, వంకలు ప్రవహించాయి. గండికోట ప్రాజెక్టులోకి వాగు, వంకల్లోని నీరు 200 క్యూసెక్కులు దాకా వచ్చి చేరుతున్నట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. తిమ్మాపురం చెరువు కట్ట వల్ల చిన్నపల్లె గ్రామంలో వర్షపు నీరు ఇండ్ల చుట్టూ చేరింది. గ్రామాన్ని ముంపులోకి తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఎక్కువ వర్షం వచ్చినప్పుడల్లా ఇలా జరుగుతున్నా గత ప్రభుత్వం తమ ను పట్టించుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాన్ని ముంపులోకి తీసుకోవాలని సంబంధించిన ఫైల్‌ను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. కొత్త ప్రభుత్వం లోనైనా తమ గ్రామాన్ని ముంపులోకి తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఋతుపవనాలు ప్రారంభం కాగానే వర్షం కురస్తుండడంతో రైతులు,ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎల్‌ఎల్‌బీ పరీక్ష ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ, తదితరులు

కడప (ఎడ్యుకేషన్), జూన్ 6 : వైవీయూ ఎల్‌ఎల్‌బీ 3, 5 సెమిస్టర్ల పరీక్షల ఫలితాలను వైస్ చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ గురువారం విడుదల చేశారు. వీసీ చాంబరులో రిజిస్ట్రారు వైపీ వెంకటసుబ్బయ్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఈశ్వర్‌రెడ్డితో కలిసి ఫలితాలు విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎల్‌ఎల్‌బీ ఐదేళ్ల కోర్సులో మూడు సెమిస్టరు పరీక్షల్లో 50 శాతం, ఐదో సెమిస్టరు ఫలితాల్లో 74 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. మూడో సెమిస్టరులో 67 శాతం ఉత్తీర్ణులయ్యారని, ఐదో సెమిస్టరులో 70 శాతం మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. వీటితో పాటు ఎల్‌ఎల్‌బీ 7, 9 సెమిస్టరు ఫలితాలను వెల్లడించారు. 7వ సెమిస్టరులో 87 శాతం, 9వ సెమిస్టరులో 80 శాతం మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ సహాయ అధికారి గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కువైత్ యాదవ సంఘం ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందిస్తున్న రాజాయాదవ్ తదితరులు

బద్వేలు రూరల్, జూన్ 6: ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న దుగ్గినేని రాజాకు కువైత్ యాదవ సంఘం లక్షా 76 వేలు ఆర్థికసాయం అందించారు. స్థానిక విద్యానగర్‌లో నివాసం ఉంటున్న దుగ్గినేని రాజా గత నెల 20న వ్యక్తిగత పనిపై పోరుమామిళ్లకు వెళ్లి అక్కడ అదుపు తప్పి బైకు డివైడరును ఢీకొంది. దీంతో తలకు బలమైన గాయాలయ్యాయి. కడపలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. చికిత్స కోసం ఐదు లక్షల మేర ఖర్చు కావడంతో నిరుపేద కుటుంబమైన రాజా కుటుంబ సభ్యులు కువైట్ యాదవ సంఘాన్ని ఆర్థిక సాయం కోరడంతో కువైత్ యాదవ సంఘం అధ్యక్షుడు చల్లా బాబు, నియోజకవర్గ యాదవ సంఘం అధ్యక్షుడు బుర్రి రాజాయాదవ్ లక్షా 76 వేలు నగదును కడపలోని ఆస్పత్రికి వెళ్లి కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

వైవీయూకు 52 పరిశోధన ప్రాజెక్టులు

ఒకేసారి ఏ యూనివర్సిటీ పొందని ప్రాజెక్టు వైవీయూ సొంతం

కడప (ఎడ్యుకేషన్), జూన్ 6 : యోగివేమన యూనివర్సిటీకి ప్రతిష్టాత్మకంగా 52 పరిశోధన ప్రాజెక్టులు మంజూరయ్యాయి. రాష్ట్రీయ ఉచ్చరత శిక్ష అభియాన్-2 కింద కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.3.49 కోట్లు విడుదల చేసింది. తొలివిడతగా 53 కోట్లు విడుదల చేసింది. ఒకేసారి 52 ప్రాజెక్టులు పొందిన విశ్వవిద్యాలయంగా వైవీయూకు కీర్తి దక్కనుంది. విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు ఫెలోషిప్‌లు ఇవ్వడానికి పరిశోధన అవసరాల వినియోగం కోసం ఆధునిక పరికరాలు కొనుగోలు, నాణ్యమైన పరిశోధనలు చేసేందుకు దోహదపడనుంది. వైవీయూలో 52 మంది ప్రొఫెసర్స్, అసిస్టెంటు ప్రొఫెసర్లు ఈ ప్రాజెక్టులు చేపట్టనున్నారు. రూసా-1 ద్వారా విడుదలైన 20 కోట్ల నిధులను ప్రభావవంతంగా వినియోగించడంతో పాటు ఆధునిక పరిశోధనలకు బీజం వేయడం వల్ల రూసా నిధుల విడుదలకు మార్గం సుగమమైంది. పీఎం ఉషా (రూసా) కింద దేశంలోని ప్రతిష్టాత్మకమైన 75 సంస్థలకు ఒక్కో సంస్థకు 20 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. అందులో వైవీయూ కూడా ఉండడం గమనార్హం.

పరిశోధనల్లో మేటిగా వైవీయూ : వీసీ చింతా సుధాకర్

వైవీయూ బోధనా పరిశోధనాపరంగా నిపుణులైన అధ్యాపకులు ఇక్కడ ఉన్నారు. నాణ్యమైన బోధనలు చేస్తున్నందువల్లనే ప్రతిష్టాత్మకమైన కేంద్ర ప్రభుత్వ సంస్థలు నిధులు మంజూరు చేస్తున్నాయి. తద్వారా అకడమిక్ పరిశోధనా పరంగా విద్యార్థులకు యూనివర్సిటీ అత్యంత ప్రయోజకరం.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



మృతి చెందిన సుబ్బులమ్మ, ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు

సంబేపల్లె, జూన్ 6: మండల పరిధిలోని శెట్టిపల్లె గ్రామం దొడ్డిచేను వడ్డెపల్లె బస్టాప్ వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో కుంచపు సుబ్బులమ్మ (68) మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు.. శెట్టిపల్లె గ్రామం దొడ్డిచేనువడ్డెపల్లెకు చెందిన సుబ్బులమ్మ సంబేపల్లెకు రావడానికి బస్సు కోసం బస్టాప్ వద్ద ఉండగా ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈమె భర్త రామయ్య ఐదు సంవత్సరాల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతురాలికి పిల్లలు లేరని ఒంటరిగానే ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ తీగలు తగిలి యువకుడు మృతి



శ్రీను మృతదేహం

రైల్వేకోడూరు, జూన్ 6: మండలంలోని రాఘవ రాజపురం పంచాయితీలో బుధవారం సాయంత్రం దోస కాయలను లారీకి లోడింగ్ చేస్తుండగా విద్యుత్ తీగలు తగులుకుని యువకుడు మృతి చెందాడు. గురువారం రైల్వేకోడూరు హెడ్‌కానిస్టేబుల్ విజయ్‌కుమార్ అందించిన వివరాల మేరకు.. మండలంలోని సూరపురాజుపల్లె గిరిజన కాలనీకి చెందిన మోపూరి శ్రీను (25) అనే యువకుడు రాఘవరాజపురం ప్రాంతంలో దోసకాయల లోడు కు వెళ్లి లోడింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగులుకుని కింద పడ్డాడు. దీంతో హుటాహుటిన తోటి కార్మికులు, రైతులు, వ్యాపారులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే శ్రీను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గురువారం రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రిలో శవపరీక్షలు నిర్వహించి.. శవాన్ని తల్లి వెంకటమ్మకు అప్పగించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అగస్తేశ్వరస్వామికి భస్మార్చన



ప్రొద్దుటూరు టౌన్, జూన్ 6: స్థానిక అగస్తేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి ఘనంగా భస్మార్చన నిర్వహించారు. ఉజ్జయినీ మహంకాళేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించే విధంగా గురువారం సాయంత్రం భస్మార్చన నిర్వహించారు. ఉదయం స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం స్వామివారికి సహర్చనామ భస్మార్చన, భస్మ హారతి, రాజరాజేశ్వరి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, పాలక మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామి దేవస్థానంలో పల్లకీ ఉత్సవం



పల్లకీ ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

రాయచోటిటౌన్, జూన్ 6: పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో గురువారం అమావాస్య సందర్భంగా వీరభద్రస్వామి వారి పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణయ్య, శంకరయ్య స్వాముల వేదమంత్రాల నడుమ స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించి సుందరంగా అలంకరించి వేదమంత్రాల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పల్లకీ ఉత్సవంపై ఏర్పాటు చేసి మేళతాళాలతో, అర్చకుల వేద మంత్రాల నడుమ ఆలయం చుట్టూ మాడవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా పట్టణ భక్తులతో పాటు కన్నడ భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. పూజా కార్యక్రమం ముగిసిన అనంతరం అర్చక స్వాములు అర్చనలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఫ్యానుకు ఉరి వేసుకుని ఆటోడ్రైవర్ ఆత్మహత్య

సీకేదిన్నె, జూన్ 6: ఫ్యానుకు ఉరి వేసుకుని ఇల్లూరి సురేష్ (48) అనే ఆటోడ్రైవర్ మృతి చెందినట్లు చింతకొమ్మదిన్నె సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు. సురేష్ భార్య వెంకటసుబ్బమ్మ ఫిర్యాదు మేరకు చింతకొమ్మదిన్నె మండలం విశ్వనాథపురం శివాలయం వద్ద నివాసం ఉండే సురేష్ వృత్తి రీత్యా ఆటో డ్రైవర్‌గా జీవనం సాగించేవాడని, ఇతనికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉండగా పెద్దకుమార్తెకు వివాహమైందని, చిన్న కుమార్తె ఇంటర్ చదువుతుండగా కుమారుడు ఇంటర్ వరకు చదువుకుని ప్రస్తుతం కూలి పనులు చేస్తున్నాడన్నారు. భర్త తాగుడుకు అలవాటుపడి తనతో కొట్లాడినప్పుడల్లా ఇంటిలోకి వెళ్లి గడియ పెట్టుకుని మద్యం మత్తు దిగిన తర్వాత బయటకు వచ్చేవాడన్నారు. ఇటీవలే చిన్నకుమార్తెకు రాజంపేట మండలం ములక్కాయలపల్లె గ్రామానికి చెందిన బంధువు మేనత్తకొడుకు సంబంధం మాట్లాడగా చిన్నకుమార్తె వివాహం వద్దని, ఏదైనా ఉద్యోగం తెచ్చుకున్న తర్వాతనే పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో సురేష్ ఘర్షణ పడుతుండేవాడన్నారు.

ఈ సందర్భంలో చిన్నకుమార్తె తాను చెప్పిన వ్యక్తిని పెళ్లిచేసుకోవాలని గొడవపడి బెడ్‌రూములోకి పోయి మ ధ్యాహ్నం బయటకు వచ్చి భోజనం చేసి మరలా బెడ్‌రూములోకిపోవడంతో నిద్రపోతున్నాడని అనుకున్నామన్నారు. సా యంత్రం బెడ్‌రూములో భర్త ఫ్యానుకు ఉరి వేసుకుని ఉండడం చూసి గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు వచ్చి కిందకు దించి రిమ్స్‌కు తరలించగా వైద్యులు మృతిచెందినట్లు తెలిపారన్నారు. భార్య వెంకటసుబ్బమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

టీడీపీ వర్గీయులపై జరిగిన దాడిపై కేసు నమోదు

రాయచోటిటౌన్, జూన్ 6: రాయచోటి మండల పరిధిలోని యండపల్లెలో బుధవారం రాత్రి టీడీపీ వర్గీయులపై జరిగిన దాడి సంఘటనపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకి వెళితే... మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించిన అనంతరం బుధవారం రాత్రి మాధవరం టీడీపీ నాయకుడు సైకం శ్రీనివాసులరెడ్డి ఇచ్చిన విందుకు హాజరై తిరిగి రాయచోటికి వస్తుండగా మార్గమధ్యంలోని యండపల్లి గ్రామం బోయపల్లి వద్ద టీడీపీ వర్గీయులు సిద్దార్థగౌడ్ ఆధ్వర్యంలో బాణాసంచా పేల్చి స్వాగతం పలికారు. ఇది జీర్ణించుకోలేని మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డి అనుచరులు ఎమ్మెల్యే మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కుమారుడు, సైకం శ్రీనివాసులరెడ్డి కుమారుడు వాహనంలో వెళుతుండగా రాళ్లతో వాహనంపై దాడి చేయడమే కాకుండా అడ్డువచ్చిన సిద్దార్థగౌడ్ తల్లి వెంకటలక్ష్మమ్మ, సోదరుడు శివశంకర్‌గౌడ్‌లపై దాడి చేసి గాయపరిచారు.

ఈ మేరకు బాధితురాలు వెంకటలక్షుమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డికి సంబంధించిన 15 మంది అనుచరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలియజేశారు.

గంజాయి విక్రయిస్తున్న యువకులు అరెస్టు

● 10,500 కేజీల గంజాయి, 10 సెల్‌ఫోన్లు స్వాధీనం



పట్టుకున్న గంజాయి, నిందితులతో పోలీసులు

కడప (క్రైం), జూన్ 6 : కడప నగరంలో గంజాయి రవాణా చేస్తున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు కడప టూటౌన్ సీఐ ఇబ్రహీం తెలిపారు. గు రువారం తన కార్యాలయంలో గంజాయి విక్రయాలు జరిపే ఆసిఫ్, అజ్జు, ల ద్వారా కడప మేకలదొడ్డికి చెందిన షేక్ సమీర్, మాసాపేటకు చెందిన షేక్ మహ్మద్ గౌస్, కడప రవీంద్రనగర్‌కు చెందిన షేక్ మహ్మద్ రఫి, మోచంపేటకు చెందిన షేక్ సమీర్‌తో పాటు మైనర్ బాలుడిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 10 కేజీల 500 గ్రాముల గంజాయి, ఒక ద్విచక్ర వాహనం, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయి అక్రమ రవాణా చేసి మరియు అమ్మే వ్యక్తులపైన గట్టిగా నిఘా పెట్టామని, స్పష్టమైన ఆదేశాలు మేరకు తమ సిబ్బంది ఎస్ఐ సంజీవరాయుడు సిబ్బందితో మాసాపేట, దొరల గోరీల వద్ద నిఘా ఉంచినట్లు తెలిపారు. గంజాయి విక్రయిస్తుండగా వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితులను విచారించగా షేక్ సమీర్, షేక్ మహ్మద్‌గౌస్, షేక్ మహ్మద్ అనే వ్యక్తుల వద్ద నుండి గంజాయి తెచ్చి కడప టౌన్‌లో కడప చుట్టూ పక్కల మండలాల్లో గంజాయి అమ్ముతూ ఉన్నట్లు తెలిపారు. గంజాయి నేరంలో పాల్గొన్న వారిపై హిస్టరీ షీట్లు తెరుస్తామని పదే పదే ఇలాంటి నేరాలకు పాల్పడితే వారిపై పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నగరంలో వర్షం..పలు ప్రాంతాలు జలమయం

కడప (ఎడ్యుకేషన్), జూన్ 6:కడప నగరంలో గురువారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. గురువారం మధ్యాహ్నం 2గంటల పాటు భారీ వర్షం కురిసింది. దీంతో ఆర్టీసీ బస్టాండు, రైల్వేస్టేషన్ రోడ్డు, జిల్లా కోర్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆర్టీసీ బస్టాండు చెరువును తలపించేలా వర్షం నీరు చేరింది. దీంతో ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అలాగే వాహనదారులు కూడా ఇబ్బందులు పడ్డారు. అలాగే లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వచ్చేది వానకాలమని, తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


చెరువును తలపిస్తున్న కడప ఆర్టీసీ బస్టాండ్




కడప కొత్తబస్టాండ్, జిల్లా కోర్టు ప్రాంతాల్లో నిల్వచేరిన వాన నీరు

న్యాయవాదులకు అండగా ఉంటా

● ఎమ్మెల్యే మాదవీరెడ్డి

కడప(రూరల్) జూన్ 6 : ఈ ఎన్నికల్లో కడప నియోజకవర్గ ఎమ్మెల్యేగా తన గెలుపుకు టీడీపీ లీగల్‌సెల్ ఆధ్వర్యంలో న్యాయవాదులు చేసిన కృషి మరువలేనిదని, వారికి అండగా ఉంటానని కడప ఎమ్మెల్యే మాదవీరెడ్డి పేర్కొన్నారు. గురువారం టీడీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదుల బృందం మాదవీరెడ్డిని కలిసి అభినందించారు. జ్ఞాపికలను అందజేసి శాలువలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ ప్లీడర్ గుర్రప్ప, న్యాయవాదులు ఆదినారారాయణ, బి.ఓబులేసు, రమేష్, సురేష్, బాల సుబ్రమణ్యం, చంద్రగుప్త, శంకర్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే మాదవీరెడ్డిని అభినందిస్తున్న న్యాయవాదుల బృందం

నాణ్యమైన ఎరువులను విక్రయించాలి

వీరపునాయునిపల్లె, జూన్ 6: విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు నాణ్యమైన, అనుమతి గల వాటిని రైతులకు విక్రయించాలని మండల వ్యవసాయాధికారి శాయమ్‌బాబు తెలిపారు. గురువారం మండలంలోని ఎరువు దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. నిబంధనలకు లోబడే విక్రయాలు జరపాలన్నారు. ఎమ్మార్పీ ధరలకు లోబడే విక్రయాలు జరపాలని, లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్టాక్ రిజిస్టర్లు, ధరల పట్టీలను పరిశీలించారు. కొనుగోలు చేసినపుడు రసీదులు పొందాలని రైతులకు సూచించారు.

అరాచక పాలన అంతం ఆనందదాయకం: టీడీపీ

చెన్నూరు, జూన్ 6: అరాచక పాలన అంతం ఆనందదాయకమని టీడీపీ నేతలు పేర్కొన్నారు. గురువారం చె న్నూరు టీడీపీ కార్యాలయంలో యువనేత గుగ్గిళ్ల చాణక్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల కన్వీనరు విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడారు. రా ష్ట్రంలో వైసీపీ అధికారంలో కోల్పోయి కమలాపురం నియోజకవర్గంలో రవీంద్రనాథరెడ్డి దారుణంగా ఓడిపోవడంతో ఆయన దిక్కుతోచక ఒత్తిడికి గురై ప్రెస్‌మీట్లు పెట్టుకుంటన్నారన్నారు. అతన్ని చూస్తే జాలేస్తుందన్నారు. రా ష్ట్రంలో అరాచక పాలనను అంతం చేశారని, నాటి సీ ఎంగా జగన్ వ్యవస్థలను సర్వనాశనం చేసినందుకే ప్ర జలు గుణపాఠం చెప్పారన్నారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఇందిరెడ్డి శివారెడ్డి, జిల్లా మైనార్టీ నేత షబ్బీర్‌హుసేన్ మాట్లాడుతూ అక్రమం, అన్యాయానికి మారుపేరు మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ రెడ్డి అని అన్నారు. ఆయన ఈవీయంల ట్యాంపరింగ్ అని మాట్లాడడం సిగ్గుచేటన్నారు. 2019లో వైసీపీకి రాష్ట్ర ప్రజలు 151 సీట్లను ఇచ్చారని అప్పుడు మీరు ఈవీయంల ట్యాంపరింగ్ చేసినట్లు ప్రజలే మైనా మాట్లాడారా అని అన్నారు. ఆర్థిక పరిస్థితిని అధఃపాతాళానికి తొక్కారని, కోట్ల రూపాయలు రా ష్ట్రానికి ఆదాయం ఉన్నా లక్షల కోట్లు అప్పులు చేయడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షుడు ఆకుల ప్రసాద్‌బాబు, బీసీ సెల్ ఉపాధ్యక్షుడు గోవిందు శ్రీనివాసులు, మండల అధికార ప్రతినిధి లక్ష్మీనారాయణ, అతికారి విశ్వం, అనంత రాజు, నాగభూషణం, పట్టణ అధ్యక్షుడు ఆకుల చలపతి, పార్టీ సభ్యుడు కొమ్మలశ్రీకాంత్, డాక్టర్ పిచ్చయ్య, కొండాల చెన్నయ్య మాజీ జడ్పీటీసీ చిన్నయ్య, మండల రైతు విభాగం అధ్యక్షుడు బాలక్రిష్ణరెడ్డి, సుదర్శన్, రమణ, శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీడీపీ నేతలు

ప్రతి దుకాణదారుడు స్టాకు రిజిస్టర్లు మెయిన్‌టెన్ చేయాలి

● ఎరువులు, విత్తనాల దుకాణాల తనిఖీ

కమలాపురం రూరల్, జూన్ 6 : కమలాపురం మండలంలోని విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల దుకాణదారులు స్టాకు సంబంధించి రిజిస్టరు ఖచ్చితంగా మెయింటెనెన్స్ చేస్తూ ఉండాలని మండల వ్యవసాయాధికారిణి సరస్వతి అన్నారు. గురువారం మండలంలోని పలు ఎరువుల విత్తనాలు, దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి దుకాణదారుడు నిబంధనలకు లోబడి ఎరువులు విత్తనాలు, పురుగు మందుల అమ్మకాలు జరపాలన్నారు. ప్రతి డీలరు ఎమ్మార్పీ ధరలకు లోబడి అమ్మకాలు జరపాలన్నారు. లేదంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే స్టాకు రిజిస్టర్లు, ధరల పట్టీని పరిశీలించారు. రైతులు కూడా కొన్న ఎరువులు, విత్తనాలు, పురుగుమందులకు తప్పనిసరిగా రసీదులు పొందాలని కోరారు. అనుమతి ఉన్న దుకాణదారుల వద్ద మాత్రమే కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు. ప లు రికార్డులను పరిశీలించి డీలర్లకు సూచనలు, సలహాలు ఇచ్చారు.


ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న సరస్వతి

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు: సీఐ

కడప (క్రైం), జూన్ 6 :ఎన్నికల కౌంటింగ్ అయిపోయినా అల్లర్లకు పాల్పడే వారిపై చర్యలు తప్పవని చిన్నచౌకు సీఐ నరసింహారెడ్డి తెలిపారు. గురువారం కడప అశోక్‌నగర్‌లో పోలీసు కవాతు నిర్వహించారు. ద్విచక్ర వాహనాలను స్వా ధీనం చేసుకుని వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినట్లు తెలిస్తే తక్షణమే తమకు సమాచారం అందించాలన్నరు. వాహనాలకు సంబంధిత పత్రాలు తప్పనిసరి అన్నారు.


కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

దేవునికడపలో మాధవీరెడ్డికి ఘన సన్మానం


కడప ఎమ్మెల్యే మాధవి, శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులను గజమాలతో సత్కరిస్తున్న ఎద్దుల శంకర్, సాయి తదితరులు


ఆలయంలో టెంకాయలు కొట్టి మొక్కుతీర్చుకుంటున్న దేవునికడప టీడీపీ నేతలు

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 6 : దేవునికడప లక్ష్మివెంకటేశ్వర దేవాలయంలో కడప టీడీపీ ఎమ్మెల్యేగా ఎంపికైన మాధవీరెడ్డి, శ్రీనివాసులరెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. 1001 టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆమె మాట్లాడుతూ ప్రపంచం మొత్తం చూసేలా ఏపీలో ఎన్నికల ఫలితాలు వచ్చాయన్నారు. ప్రజలు తనను సొంత బిడ్డలా ఆదరించారన్నారు. ఎన్నికల ప్రచారంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానం నెరవేర్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఇంతటి ఘన విజయం ఇచ్చిన కడప నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా రుణపడి ఉంటానన్నారు. ఈ ప్రత్యేక పూజా కార్యక్రమంలో మాధవీరెడ్డి కుమార్తె, కుమారుడితో పాటు టీడీపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం మాధవీరెడ్డి దంపతులను పలువురు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి ఎద్దుల శంకర్, క్లస్టర్ ఇన్‌చార్జులు క్రిష్ణారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, నారాయణరెడ్డి, మురికినాటి శ్రీధర్, ఆకుల గోపి, సాయి, అడవాల రాజా, చెన్నంశెట్టి మురళి, 1,2,3 డివిజన్ల నాయకులు, కార్యర్తలు తదితరులు పాల్గొన్నారు.

కూటమి విజయం పట్ల టీడీపీ సంబరాలు



చక్రాయపేటలో సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నేతలు.. పెండ్లిమర్రిలో ఎన్టీఆర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ నేతలు

చక్రాయపేట, జూన్ 6: రాష్ట్రంలో టీడీపీ కూటమి భారీ విజయాన్ని నమోదు చేసిన సందర్భంగా చక్రాయపేట మండలంలో తెలుగు తమ్ముళ్ల సంబరాలు చేసుకున్నారు. మండల కేంద్రమైన చక్రాయపేటలో గురువారం ఆ పార్టీ నాయకులు టీడీపీ జండాలు చేతబట్టి ర్యాలీ నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఆధ్వర్యంలో రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వైసీపీ అరాచక పాలనను ప్రజలు చరమగీతం పాడారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మహబూబ్‌బాష, గౌస్, ముల్లా, హయాత్, సద్దాం, రెడ్డయ్య, చాంద్‌బాష, రాముడు, చర్మాల గౌస్, రేవతిరెడ్డితో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహానికి క్షీరాభిషేకం

పెండ్లిమర్రి, జూన్ 6: మండలంలోని రేపల్లె గ్రామం వద్ద ఉన్న నందమూరి తారక రామారావు విగ్రహానికి గురువారం టీడీపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు గంగిరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నా, రాష్ట్రాభివృద్ధి చెందాలన్న ఒక్క చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. గడచిన ఐదేళ్ల వైసీపీపాలనల రాష్ట్రం అభివృద్ధిలో ఎంతో వెనుకబడిపోయిందని దాన్ని గుర్తించిన ప్రజలురాష్ట్రం అభివృద్ధిచెందాలనే ఆలోచనత వైసీపీపాలనకు చరమగీతంపాడారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, అభిమానులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబుతో పునర్నిర్మాణం

వేముల, జూన్ 6: భ్రష్టుపట్టిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని చంద్రబాబు అయితేనే పునర్నిర్మించగలడని నమ్మిన ప్రజలు కూటమికి భారీ విజయాన్ని అందించారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పార్థసారథిరెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకరులో మాట్లాడుతూ ప్రజావేదికను కూల్చడం, రాజధాని అమరావతిని నిర్వీర్యం చేస్తూ పరిపాలన ప్రారంభించినపుడే వైసీపీ పతనం ప్రారంభమైందన్నారు. వైసీపీ పాలనను ప్రజలు ఎంతో ఓర్పుతో సహించారని, ప్రజా వ్యతిరేక పాలన చేస్తే ఎలా ఉంటుందో ఓటు అనే ఆయుధంతో చేసి చూపించారన్నారు. బీజేపీ, జనసేన, టీడీపీకి భారీ విజయాన్ని అందించారన్నారు.విజయానికి కృషిచేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

'ఎన్‌డీఏ కూటమి విజయం సంతోషకరం'

కడప (ఎడ్యుకేషన్), జూన్ 6: ఈ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి విజయం సంతోషకరమని మాజీ డిప్యూటీ మేయరు, టీడీపీ నాయకుడు ఆరిపుల్లా పేర్కొన్నారు. గురువారం కడప నగరంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమన్నారు.

పుత్తా విజయం పట్ల సంబరాలు

సీకేదిన్నె, జూన్ 6: కమలాపురం ఎమ్మెల్యేగా పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి ఘనవిజయం సాధించడంపట్ల మండల టీడీపీ నాయకులు ఘ నంగా సంబరాలు చేసుకున్నారు. చింతకొమ్మదిన్నె మండలంలోని ఇందిరానగర్‌లో గురువారం మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ గంధం మోహన్‌బాబు ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మునీంద్ర, గంగాధర్, మహేష్, రమణ, యోగి, భద్ర, రాజేశ్వర్‌రెడ్డి, బాష, శివశంకర్, గంగిరెడ్డి, భరత్‌రెడ్డి, చరణ్‌రెడ్డి, మునిస్వామి, గురువయ్య, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు, లోకేశ్‌ను కలిసిన పుత్తా కుటుంబ సభ్యులు


చంద్రబాబును కలిసిన పుత్తా కుటుంబ సభ్యులు

కమలాపురం రూరల్, జూన్ 6 : నియోజకవర్గం నుంచి నూతనంగా ఎమ్మెల్యేగా ఎన్నికైన పుత్తా చైతన్యరెడ్డి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు టీడీపీ అధినేత, కాబోయే సీఎం చంద్రబాబును యువ నాయకుడు లోకేశ్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. అమరావతిలోని చంద్రబాబు నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి ధన్యవదాలు తలెఇపారు. కమలాపురం నియోజకవర్గం నుంచి మొట్టమొదటిసారిగా తనకు అవకాశం కల్పించిన చంద్రబాబుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని చంద్రబాబును కోరినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో యశ్వంత్‌రెడ్డి, కిశోర్‌రెడ్డి, సాయి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుధాకర్‌రెడ్డికి రూసా పరిశోధక ప్రాజెక్టు మంజూరు

కడప (ఎడ్యుకేషన్), జూన్ 6 : కడప నగరం ప్రభుత్వ పురుషుల కళాశాలలో భౌతిక శాస్త్ర అధ్యాపకుడుగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సుధాకర్‌రెడ్డికి డాక్టర్ పోలా భాస్కర్‌కి రూసా 2.0 కింద స్టేట్ ప్రాజెక్టు డైరెక్టరు రూ.10లక్షలు మేజరు పరిశోధక ప్రాజెక్టును మంజూరు చేసినట్లు ఉత్తర్వులు జారీ చేశారని కళాశాల ప్రిన్సిపాల్ జి.రవీంద్రనాథ్ తెలిపారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ తమ కళాశాలకు నిధులు మంజూరు కావడం గర్వకారణమన్నారు. సుధాక రెడ్డి మాట్లాడుతూ స్ట్రిక్టో స్కోపిక్ ఇన్విస్టిగేషన్ అన్ రేర్ ఎర్త్ అయాన్స్ గోపెడ్ జింక్ కార్బియం టెల్లూరియం టంగ్ టాస్ బోరో ఫోస్ఫేటేగ్లాసెస్ పర్ హైపవర్ ఇడియర్ ఇన్‌ఫ్రా రెడ్ సాలిడ్ స్టేట్ లేజర్స్ అండ్ ఫైబర్ ఆంప్లిఫయర్స్ అనే అంశంపై పరిశోధనలు చేయనున్నట్లు తెలిపారు. భౌతికశాస్త్ర విభాగంలో సుధాకర్‌రెడ్డి ఇప్పనటికే యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ ఆధ్వర్యంలో 53 లక్షలు పరిశోధక ప్రాజెక్టులను పూర్తి చేశారు. వీటి ద్వారా ఇద్దరు పరిశోధక విద్యార్థులు పీహెచ్‌డిలు పొందారని అన్నారు. సుధాకర్‌రెడ్డి పర్యవేక్షణలో ఇప్పటి వరకు ఏడుగురు విద్యార్థులు పీహెచ్‌డి పొందారన్నారు.


కడప ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవిని దుశ్శాలువాతో సన్మానించి అభినందిస్తున్న టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరిక్రిష్ణ


కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డిలను దుశ్శాలువాతో సన్మానిస్తున్న టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరిక్రిష్ణ


సత్తెనపల్లె ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు అభినందనలు తెలుపుతున్న టింబర్ డిపో శ్రీనివాసులు, బండి బాబు, మంజునాథ శ్రీనివాసులు

'భూమి ఇప్పించి న్యాయం చేయండి'

కమలాపురం రూరల్, జూన్ 6 : తన భూమిని వేరే వాళ్లు దౌర్జన్యంగా ఆక్రమించారని, తిరిగి తనకు ఇప్పించాలని విభరాపురం గ్రామానికి చెందిన చిట్టెలుంగాల ఉత్తయ్య తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల పరిధిలోని విభరాపురం గ్రామం పొలంలో సర్వే నం.11లో 0.50 సెంట్ల భూమి మా పూర్వీకుల నుంచి మేమే సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. అయితే అదే గ్రామానికి చెందిన వెంకటసుబ్బయ్య తనకు తెలియకుండా తాను ఊర్లో లేని సమయంలో ఆ భూమిని మహ్మద్‌హుసేన్ అనే వ్యక్తికి అమ్మాడని, ఆ విషయం తెలుసుకున్న తాను మహ్మద్ హుసేన్‌తో మాట్లాడి తిరిగి ఆ భూమిని కొనుగోలు చేసి నా స్వాధీనంలో ఉంచుకున్నానన్నారు. అయితే గత కొన్ని సంవత్సరాలుగా ఆ భూమి సాగు చేసుకోలేదని, ప్రస్తుతం బీబీ అనే ముస్లిం మహిళ ఆ భూమి నాదంటూ భూమి వద్దకు నీవు రావద్దంటూ నాపై దౌర్జన్యం చేస్తూ తనను బెదిరిస్తుందని తెలిపారు. రోజురోజుకూ నాకు వేధింపులు ఎక్కువవుతున్నాయని జిల్లా ఉన్నతాధికారులు నాపై దయ ఉంచి ఆ మహిళ బారినుంచి తనను కాపాడి నా భూమిని నాకు ఇప్పించాలని వేడుకున్నాడు.

జడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్‌ను సందర్శించిన డిప్యూటీ డీఈఓ

వేంపల్లె, జూన్ 6: పట్టణంలోని జడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్‌ను ప్రొద్దుటూరు డిప్యూటీ డీఈఓ కృష్ణయ్య గురువారం సందర్శించారు. ఇప్పటి వరకు ఎన్ని అడ్మిషన్లు అయ్యాయి, ఇంటర్ రిజల్ట్స్ ఎలా నమోదు అయ్యాయని ఆరాతీశారు. రికార్డులను పరిశీలించారు. హైస్కూల్ ప్లస్‌లను బలోపేతం చేయాల్సిన బాధ్యతపీజీటీ అధ్యాపకులదే అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం చెరుకూరుశ్రీనివాసులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ అరుణ్‌రెడ్డి వీఆర్‌కు బదిలీ


ఎస్ఐ అరుణ్‌రెడ్డి

పులివెందుల టౌన్, జూన్ 6: పులివెందుల అర్బన్ ఎస్ఐ అరుణ్‌రెడ్డి గురువారం వీఆర్‌కు బదిలీ చేస్తూ జిల్లా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 3వ తేదీన పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని ఉలిమెల్ల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త నర్రెడ్డి సురేంద్రపై పులివెందుల పోలీసులు బైండోవర్ కేసు నమోదు చేశారు. ఇంటికి వెళ్లాలని సు రేంద్ర అడగ్గా ఎస్ఐ దుర్భాషలాడడంతో పాటు బూటు కాలుతో తన్నడంతో పాటు విచక్షణ రహితగా కొట్టడంతో సురేంద్రకు కంటిపై గాయమైంది. వెంటనే పోలీసులు పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యంకోసం రిమ్స్‌లో జాయిన్ చేశారు. ఈ విషయంపై కడపరిమ్స్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ అరుణ్‌రెడ్డిపై ఫిర్యాదు చేశారు. కేసును పులివెందుల పోలీసులకు బదిలీచేయడంతో పాటు, ఎస్పీ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. దీంతో ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఎస్ఐ అరుణ్‌రెడ్డిని వీఆర్‌కు బదిలీ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయన వీఆర్‌లో రిపోర్ట్ చేసుకున్నట్లు సమాచారం.

ప్రధానిగా మూడోసారి మోదీ ఎంపికపై హర్షం

చెన్నూరు, జూన్ 6 : ఎన్‌డీఏ కూటమి నుండి ప్రధానిగా నరేంద్ర మోదీ మూడోసారి ఎంపిక కావడం పట్ల చెన్నూరు మండల బీజేపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు చెన్నూరులో స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా మండల శాఖ అధ్యక్షుడు తాడి భాస్కర్, మహిళా మోర్చా జిల్లా నాయకురాలు పెడబల్లి సరోజనమ్మ మాట్లాడారు. బీజేపీ సీనియర్ నేతలు మాదినేని రామ సుబ్బయ్య, అతికారి రవికుమార్, శ్రీనివాసరాజు, ప్రతాప్‌రెడ్డి, వెంకటరమణ, శివరామిరెడ్డి, రెడ్డిప్రసాద్, మునిసుబ్బారెడ్డి, శివారెడ్డి, రమణ పాల్గొన్నారు.


మిఠాయిలు పంచిపెడుతున్న బీజేపీ నేతలు

ఉండవల్లికి నేతల వెల్లువ

నారా చంద్రబాబు నాయుడు, లోకేష్‌ను కలిసిన కొత్త ఎమ్మెల్యేలు వరదరాజులరెడ్డి, పుట్టా సుధాకర్ యాదవ్, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్, జిల్లా టీడీపీ నేతలు



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని కలిసిన ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, జూన్ 6: రాష్ట్రంలో టీడీపీ ఘన విజయం సాధించిన తర్వాత గెలుపొందిన ప్రజాప్రతినిధులు ఉండవల్లికి క్యూ కట్టారు. ప్రొద్దుటూరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌యాదవ్, ప్రొద్దుటూరు, బద్వేలు నేతలు ఉండవల్లిలోని నివాసంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్‌ను కలిసి అభినందించారు. రాష్ట్ర చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో సాధించిన గెలుపుపై వరదరాజుల రెడ్డి లోకేష్‌తో ఆనందాన్ని పంచుకున్నారు. త్వరలో ప్రభుత్వ ఏర్పాటు, ప్రొద్దుటూరు తాజా రాజకీయాలపై చంద్రబాబుతో వరదరాజులరెడ్డితో చర్చించారు. వరదరాజుల రెడ్డితో ఆయన మనుమడు టీడీపీ యువనేత మెట్టుపల్లి అమల్ రెడ్డి రవిరెడ్డి లోకేష్‌ను కలిశారు.

లోకేష్‌ను కలిసిన కొండారెడ్డి

టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్‌ను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి కలిశారు. నియోజకవర్గంలో తాజా రాజకీయాలపై లోకేష్‌కు తెలిపారు. టీడీపీ ఘన విజయం, త్వరలో ఏర్పాటు కానున్న ప్రభుత్వం ఏర్పాటుతో కార్యకర్తల ఆనందానికి అవధుల్లేవని తెలిపారు.

నందం సుబ్బయ్య హత్యకేసును సీఐడీతో పున: విచారణ జరిపించాలి

ప్రొద్దుటూరు బీసీ నేత నందం సుబ్బయ్య హత్య కేసును సీఐడీతో పునః విచారణ చేపట్టాలని టీడీపీ నేత జీవీ ప్రవీణ్ రెడ్డి నారా లోకేష్‌ను కోరారు. నారా లోకేష్ స్వగృహంలో ప్రవీణ్‌రెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రాచమల్లు ప్రసాద్‌రెడ్డి ఆయన బావమరిది బంగారురెడ్డి సాగించిన ఇసుక భూదందాలపై ప్రశ్నించినందుకు నందం సుబ్బయ్యను అతికిరాతకంగా నరికి చంపిన హంతకులను చట్టం ముందు నిలబెట్టి శిక్షించాలని కోరారు.

లోకేష్‌ను కలిసిన మహేశ్వరరెడ్డి

టీడీపీ జాతీయ కార్యదర్శి నారాలోకేష్ బాబును మాజీ జడ్పీటీసీ సభ్యుడు తోట మహేశ్వర రెడ్డి గురువారం ఆయన స్వగృహంలో కలిశారు. ఈసందర్భంగా టీడీపీ ఘన విజయం సాధించినందుకు లోకేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

చంద్రబాబు, లోకేష్‌ను కలిసిన పుట్టా, తనయులు

మైదుకూరు, జూన్ 6: టీడీపీ అధినేత చంద్రబాబు, యువనేత లోకేష్‌ను మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ గురువారం ఉండవల్లిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. చట్ట సభలకు ఎన్నికైన తండ్రీ కొడుకులు భవిష్యత్ ప్రణాళికపై మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే నందమూరి బాలక్రిష్ణను సైతం కలిశారు. వీరితో పాటు పుట్టా చిన్న కుమారుడు రవికుమార్ యాదవ్, టీడీపీ నేతలు రామచంద్రనాయుడు, ఏపీ రవీంద్ర తదితరులున్నారు.

శుభాకాంక్షలు తెలిపిన రితేష్

బద్వేలుటౌన్, జూన్ 6: సార్వత్రిక ఎన్నికల్లో అఖండ విజయం సాధించి, చరిత్ర సృష్టించిన టీడీపీ అధినేత నారా చంద్రబాబు, మంగళగిరిలో అత్యధిక మెజార్టీతో గెలుపొందిన నారాలోకేష్‌ను బద్వేలు నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌కుమార్‌రెడ్డి కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, కుమారులు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్, పుట్టా రవికుమార్ యాదవ్ - బద్వేలు నేత రితేష్‌కుమార్‌రెడ్డి - టీడీపీ జాతీయ కార్యదర్శి లోకేష్‌బాబును కలిసిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి - టీడీపీ నేత ప్రవీణ్‌రెడ్డి - మాజీ జడ్పీటీసీ సభ్యుడు తోట మహేశ్వరరెడ్డి

ఖరీఫ్‌కు రైతులను సమాయత్తం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి

గోపవరం, జూన్ 6: ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసేందుకు సమాయత్తం చేయాలని బద్వేలు వ్యవసాయ డివిజన్ సహాయ సంచాలకులు ఎం.నాగరాజు తెలిపారు. గోపవరం వ్యవసాయ డివిజన్ కార్యాలయంలో ఏఓ జి.రామక్రిష్ణయ్యతో కలిసి గురువారం బద్వేలు అర్బన్ రైతు భరోసా కేంద్రంలో శిక్షణ, సమీక్ష నిర్వహించారు. జీలుగ, జనుము, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట ఎరవుల విత్తన పంపిణీ రసాయనిక ఎరువుల సరఫరా ప్రణాళికపై సమగ్రంగా చర్చించారు. ఖరీఫ్ సీజన్ ఆశాజనకంగా ఉందని రైతులకు సాంకేతిక సలహాలు ఇవ్వడం తప్పనిసరన్నారు. అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచాలని, ప్రస్తుతం సాగులో ఉన్న పంటలపై చీడపీడలు గుర్తించి సస్యరక్షణ చర్యలు సూచించేందుకు రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. రైతు భరోసా కేంద్రంలో రిజిస్టర్లను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలన్నారు. విత్తనశుద్ధి ఉత్తమ యాజమాన్య పద్ధతులు అవలంభించాలన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో కలిసి పనిచేసే రైతుల సంఖ్య, విస్తీర్ణం పెంచాలన్నారు. క్షేత్రస్థాయి సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. రైతు భరోసా కేంద్ర సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

విత్తన, పురుగుమందుల దుకాణాల ఆకస్మిక తనిఖీ



రికార్డులను తనిఖీ చేస్తున్న ఏఓ

ఎర్రగుంట్ల, జూన్ 6: చట్ట ప్రకారమే రైతులకు విత్తనాలు అమ్మాలని ఏఓ శ్రీకాంత్‌రెడ్డి విత్తన దుకాణదారులను ఆదేశించారు. మండలంలోని విత్తన, పురుగు మందుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాకును చెక్‌చేసి రిజిస్టర్లను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలను అమ్మాలన్నారు. అమ్మిన ప్రతి రైతుకు బిల్లులు కచ్చితంగా ఇవ్వాలన్నారు. అనుమతిలేని, నాశిరకం, నకిలీ విత్తనాలను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రోజూ స్టాక్ రిజిస్టర్లను అప్డేట్ చేసి ఉంచు కోవాలన్నారు. బిల్లు పుస్తకాలు సక్రమంగా రాసి పెట్టుకోవాలన్నారు. ప్రతి డీలర్ అనుమతి పొందిన ఉత్పత్తులు మాత్రమే రైతులకు విక్రయించాలన్నారు. లైసెన్స్ కనపడేలా ప్రదర్శించాలన్నారు. స్టాక్ బోర్డ్ రోజూ రాసి ఉంచుకోవాల న్నారు. విత్తన దుకాణాల్లో కాలం చెల్లిన వాటిని ఉంచరాదన్నారు.

ఎరువులు, విత్తనాల దుకాణాలు తనిఖీ

కలసపాడు, జూన్ 6: మండలంలోని విత్తనాలు ఎరువుల దుకాణాలను గురువారం మండల వ్యవసాయాధికారి షరీఫ్ తనిఖీ చేశారు. అక్కడి అమ్మకాల రికార్డులను పరిశీలించి స్టాకును తనిఖీ చేశారు. రైతులు కొనుగోలు చేసిన తరువాత వారికి రసీదులు తప్పక ఇవ్వాలని విత్తన దుకాణ యజమానులకు ఆదేశించారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవు



విత్తనాల కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏఓ

ఖాజీపేట, జూన్ 6: మండల పరిధిలో ఎక్కడైనా నకిలీ విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే చర్యలు తప్పవని ఏఓ నాగార్జున హెచ్చరించారు. మండల పరిధిలోని విత్తన కేంద్రాలను పరిశీలించారు. మండలానికి పచ్చిరొట్ట విత్తనాలు 370 క్వింటాళ్లు మంజూరయ్యాయని, అందులో 150 క్వింటాళ్లు పంపిణీ చేశామని, ఇంకా కావాల్సిన రైతులు ఆర్‌బీకే కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకుని సబ్సిడీపోను కిలోకు రూ.44 చెల్లించాలన్నారు. ఐదెకరాల్లోపు ఉన్న రైతులు అర్హులని, వరి పంట సాగు చేసే ముందు పచ్చిరొట్ట విత్తనాలు వేస్తే పంట దిగుబడి వస్తుందన్నారు.

ప్రజాతీర్పుపై వైసీపీకి నమ్మకం లేదు : టీడీపీ



విలేకరులతో మాట్లాడుతున్న మైనార్టీ నేతలు

ఖాజీపేట, జూన్ 6: ప్రజా తీర్పుపై నమ్మకం లేకుంటే భవిష్యత్తులో మీకు పుట్టగతులు ఉండవని టీడీపీ మాజీ రాష్ట్ర మైనార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి సిద్దారం కదీరుల్లా అన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజల నమ్మకం పొందలేని వైసీపీ నేతలు కుట్రలు, కుతంత్రాలు చేయడం తగదన్నారు. వైసీపీ నేతలు నోటికొచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదన్నారు. 2019 ఎన్నికల్లో మీరు ట్యాంపరింగ్‌కు పాల్పడి ఉంటే 151 సీట్లు వచ్చాయా అని ప్రశ్నించారు. డీఎల్ రవీంద్రారెడ్డి టీడీపీకి మద్దతు ఇవ్వడంతో ఖాజీపేటలో మెజార్టీ సాధించారన్నారు. మైదుకూరు ఎమ్మెల్యే సుధాకర్‌యాదవ్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ముందంజలో ఉండేలా చేస్తారన్నారు. కేకే బ్రదర్స్, హర్షద్, ఇబ్రహీం, సునీల్, జాఫర్, అబ్దుల్లా, మహమ్మద్, ఆసీఫ్, పాల్గొన్నారు.

మంచినీటి సమస్యను పరిష్కరించాలని వినతి

బద్వేలు, జూన్ 6: మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ గురువారం సీపీఎం ఆధ్వర్యంలో ప్రజలతో కలిసి మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. సీపీఎం నేత చిన్ని మాట్లాడుతూ శివానగర్, పూసలవాడ, మార్తోమానగర్, నూర్‌బాష కాలనీ, శివరామక్రిష్ణనగర్, చెన్నంపల్లె ఐలమ్మ కాలనీ, జ్యోతి బసు కాలనీల్లో 10 రోజులుగా నీరు రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పొలాల్లోకి వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోందని దీనిపై స్పందించి తక్షణమే నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. స్పందించిన మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తామని అంతవరకు సమస్య ఉన్న చోట ట్యాంకర్ల ద్వారా ప్రజలకు మంచినీటిని అందజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు మోక్షమ్మ, రామలక్షుమ్మ, ఖైరున్‌బీ, మస్తాన్‌బి తదితరులు పాల్గొన్నారు.

నూతన కూటమి ప్రభుత్వానికి అభినందనలు

బద్వేలుటౌన్, జూన్ 6: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన నూతన కూటమి ప్రభుత్వానికి డెమోక్రటిక్ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రవిశంకర్ అభినందనలు తెలిపారు. గురువారం డెమోక్రటిక్ పీఆర్‌టీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికలు ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల ఆత్మాభిమానానికి ప్రతీక అని తెలిపారు. కొత్తగా ఏర్పడబోయే కూటమి ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధికి తక్షణమే 117 నెంబర్ జీఓను రద్దుచేసి మెగా డీఎస్సీని ప్రకటించాలని కోరారు. ఇంగ్లీష్ మీడియం సహా సమాంతరంగా మాతృభాషలో విద్యాబోధనను కొనసాగించే విధంగా నిర్ణయం చేయాలని ఆయన కోరారు. కొత్త విద్యాసంవత్సరంలో ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు పూనుకోవాలని ఆయన కోరారు.

రాచమల్లు అహంకారానికి బుద్ధి చెప్పారు

బీజేపీ, తెలుగుతమ్ముళ్ల సంబరాలు ● బాబు చిత్ర పటానికి పాలాభిషేకం



ప్రొద్దుటూరు అమృతనగర్‌లో టీడీపీ విజయోత్సవ సంబరాలు చేసుకుంటున్న శివచంద్రారెడ్డి, మురళీధర్‌రెడ్డి, జబీవుల్లా - బద్వేలులో కేక్ కట్ చేసి... జమ్మలమడుగు అంబవరంలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న తెలుగు తమ్ముళ్లు, మహిళలు

ప్రొద్దుటూరు, మే 6: 'ప్రాణమున్నంత వరకు ప్రొద్దుటూరులో టీడీపీ జెండా ఎగురనీయనన్న' రాచమల్లు ప్రసాద్‌రెడ్డి అహంకారానికి ప్రొద్దుటూరు ప్రజలు తమ ఓట్లతో గట్టిగా బుద్ధి చెప్పారని కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి మున్సిపల్ మాజీ ఇన్‌చార్జ్ చైర్మెన్ వైఎస్‌జబీవుల్లా, కౌన్సిలర్లు వంగనూరు మురళీధర్‌రెడ్డి మునీర్ పేర్కొన్నారు. టీడీపీ అఖండ విజయాన్ని సొంతం చేసుకోవడంతో గురువారం అమృతనగర్‌లో బాణసంచా పేల్చి భారీ కేక్‌ను కట్ చేసి కార్యకర్తలకు అభిమానులకు పంచిపెట్టారు. రాష్ట్రంలో వైసీపీ పాలన గాడితప్పడంతోనే తామంతా వైసీపీని వీడి టీడీపీలోచేరి పార్టీ గెలుపు కోసం పనిచేశామన్నారు. రాష్ట్ర చరిత్రలో ఇలాంటి గెలుపును ఎవరూ ఊహించలేదన్నారు. ఎవరైనా నియంతలా పరిపాలిస్తే ప్రజలు ఇలాంటి తీర్పు నిస్తారని, ఇది పెద్ద గుణపాఠం కావాలన్నారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు వెల్లాల భాస్కర్, కొనిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి దుగ్గిరెడ్డి రఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

బద్వేలులో విజయోత్సవాలు

బద్వేలు రూరల్, జూన్ 6: వైసీపీ అరాచకాలకు ప్రజలు చరమగీతం పాడి అభివృద్ధిని ఆకాంక్షించి చంద్రబాబును గద్దెనెక్కించారని 33వ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ మిత్తికాయల రమణయాదవ్, బీజేవైఎం రాష్ట్ర నేత సురేంద్ర పేర్కొన్నారు. స్థానిక గాంధీవీధిలో టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు యువకులతో కలిసి కేక్‌లు కట్‌చేసి ఎన్‌డీఏ కూటమి విజయోత్సవాలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్రంలో ఐదేళ్లపాటు అభివృద్ధి, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జనసేన మిత్తికాయల ప్రసాద్, యారవ ఈశ్వర్, యారవ గంగాధర్, పవన్, గురుసాయి, నందా, నాగేంద్ర, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

జమ్మలమడుగు, జూన్ 6: స్థానిక ముద్దనూరు రోడ్డులోని అంబవరం గ్రామంలో గురువారం సాయంత్రం తెలుగు తమ్ముళ్లు, మహిళలు ఆనందోత్సాహాలతో సంబరాలు చేసుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. టీడీపీ నేత అంబవరం రామయ్య మాట్లాడుతూ టీడీపీ అత్యధిక సీట్లతో అధికారంలోకి రావడం, ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించామన్నారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడం, చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారని టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు అనంతనాయుడు, సుబ్రహ్మణ్యం, పూర్ణానాయక్, మహిళలు పాల్గొన్నారు.

కూటమి విజయం చారిత్రాత్మకం

కాశినాయన జూన్ 6: రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి సాధించిన విజయం చారిత్రాత్మకమని టీడీపీ జిల్లా కార్యదర్శి పోలు మురళీకృష్ణ, టీడీపీ నేత రోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించి చంద్రబాబు నాలోగో సారి ముఖ్యమంత్రి పదవిని చేపట్టబోతుండడంతో గురువారం రెడ్డికొట్టాలలో టీడీపీ నేతలు కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు శీను, రామక్రిష్ణ, బాలాజీ, సతీష్, రమణ, రాజు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



రెడ్డికొట్టాలలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నేతలు

కడప ఎమ్మెల్యే దంపతులను సన్మానించిన బద్వేలు నేతలు



శ్రీనివాసరెడ్డి దంపతులను సన్మానిస్తున్న రాంబాబు, తదితరులు

బద్వేలు, జూన్ 6: కొత్తగా ఎన్నికైన కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి దంపతులను గురువారం కడపలోని వారి నివాసంలో బద్వేలు టీడీపీ సీనియర్ నేతలు కొంకుల రాంబాబు, అతని సోదరులు కొంకుల రమణ, కొంకుల శ్రీరాములు ఘనంగా సన్మానించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మాధవి రెడ్డి ఘన విజయం సాధించడంతో ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, అంజి, కేశవ రామ్ తదితరులు పాల్గొన్నారు.

135 మందికి బీసీజీ టీకా పంపిణీ



బీసీజీ టీకా వేస్తున్న వైద్యబృందం

ప్రొద్దుటూరు క్రైం, జూన్ 6: క్షయ నివారణ కోసం జరిపిన మొదటి విడత 135 మందికి టీకా పంపిణీ చేసినట్లు డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ శంకరయ్య, టీబీ సూపర్‌వైజర్ రాజరత్నం తెలిపారు. గురువారం 18 ఏళ్లు పైబడిన వారికి క్షయ నివారణ కోసం ట్రీట్‌మెంట్ ఇచ్చారు. టీబీ వచ్చిన కుటుంబసభ్యులకు, టీఎంబీ 18 కంటే తక్కువ వున్న వారికి, షుగర్ వ్యాధిగ్రస్తులకు, 60 ఏళ్లు పైబడిన వారిలో కడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ ఉన్నవారికి మందు ఇచ్చారు. వ్యాక్సిన్ ప్రాముఖ్యత వివరించారు.

ముమ్మరంగా బీసీజీ కార్యక్రమం

కాశినాయన జూన్ 6: భవిష్యత్‌లో టీబీ సోకకుండా ఉండేందుకు ప్రతిఒక్కరూ బీసీజీ టీకాను వేయించుకోవాలని సీహెచ్‌ఓ శ్రీనాథ్ పేర్కొన్నారు. గురువారం పిట్టిగుంటలో బీసీజీ టీకాలు వేసి వాటి ఉపయోగంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. 104 వాహన పర్యవేక్షకులు చంద్రశేఖర్ ఏఎన్ రవణమ్మ ఆశాకార్యకర్త పాల్గొన్నారు.

లింగనిర్ధారణ నేరం

ఖాజీపేట, జూన్ 6: ఎక్కడైనా లింగనిర్ధారణ జరిగినట్లు సమాచారం తెలిస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఖాజీపేట సూపర్‌వైజర్ భారతి హెచ్చరించారు. గురువారం పత్తూరు మెయిన్స్ అంగన్వాడీ కేంద్రంలో బేటీ బచావో, బేటీ పడావోలో వారు మాట్లాడుతూ కిశోరబాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు నిర్మల, ధనలక్ష్మి పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 6: విద్యార్థులు రోజూ గ్రంథాలయాల్లో పుస్తకాలు చదవడం వలన విజ్ఞానం పెరుగుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్ పేర్కొన్నారు. పుట్టపర్తి నారాయణాచార్యుల గ్రేడ్-1 గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం పరిశీలించిన ఆయన మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్టోరీ రైటింగ్, మోరల్ స్టోరీస్, గణితం, స్పోకెన్ ఇంగ్లీషు బోధనను పరిశీలించారు. చెస్, క్యారెమ్స్ క్రీడలు నిర్వహించే విధానంపై అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు చాడా మునిరెడ్డి, రచయిత జింకా సుబ్రహ్మణ్యం, పవన్‌కల్యాణ్, లైబ్రేరియన్ గంగాదేవి పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాలు సద్వినియోగం చేసుకోండి

పోరుమామిళ్ల, జూన్ 6: జిల్లా కేంద్రం కొప్పర్తిలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని దీనిని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 8న జిల్లా గ్రామీణావృద్ధి సంస్థ ఆధ్వర్యంలో యువతీ, యువకులకు శిక్షణతో సంబంధం లేకుండా కొప్పర్తిలో 150 మందికి ఉపాధి అవకాశాలున్నాయన్నారు. 8న పోరుమామిమళ్ల వెలుగు కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నారని దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ బీటెక్ చదివిన వారికి వారి విద్యార్హతను బట్టి అవకాశాలు, శాలరీలు కేటాయించబడతాయన్నారు. మరిన్ని వివరాలకు 7731013622ను సంప్రదించాలన్నారు.

మెడిసిన్‌లో సత్తాచాటిన ఆణిముత్యం



గురుచంద్రిక

బ్రహ్మంగారిమఠం, జూన్ 6: వీరనారాయణపురం వాసులు యద్దపు వెంకట్రామిరెడ్డి, యద్దపు ప్రమీల కుమార్తె యద్దపు గురుచంద్రిక ఇటీవల మెడిసిన్‌లో 720కి 625 మార్కులు సాధించింది. విద్యార్థిని గురుచంద్రికకు తోటి స్నేహితురాల్లు, బంధువులు తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు. పేద కుటుంబం నుంచి చదువుకుంటూ మెడిసిన్‌లో ఉత్తీర్ణులు ప్రజలు యద్దపు గురుచంద్రికకు అభినందనలు తెలిపారు.

నీట్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



పూజితాంజలి



ప్రొద్దుటూరు టౌన్, జూన్ 6: స్థానిక సూపర్‌బజార్ రోడ్డులోని శ్రీ విద్యా జూనియర్ కళాశాల విద్యార్థులు నీట్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనపరిచారని ప్రిన్సిపల్ కేవీ రమణరావు తెలిపారు. పూజితాంజలి 720 మార్కులకు 626 మార్కులు సాధించి 6844వ ర్యాంకు సాధించింది. కావ్య 524 మార్కులతో 18,125 ర్యాంకును సాధించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్‌తోపాటు డైరెక్టర్లు శ్రీకాంత్‌కుమార్‌రెడ్డి, రామమోహన్, అధ్యాపకులు అభినందించారు.

రేషన్ డీలర్ల ఇష్టారాజ్యం

● అధికారులు నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలని వినతి

జమ్మలమడుగు, జూన్ 6: రేషన్ డీలర్ల వ్యవహారం ఇష్టారాజ్యంగా మారినట్లు పలువురు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 1వ తేదీ నుంచి రేషన్ డీలర్లు బియ్యం, తదితర వస్తువులు పంపిణీ చేయాల్సి ఉంది. కొందరు ఆలస్యంగా పంపిణీ చేపట్టినట్లు తెలుస్తోంది. మరికొందరు డీలర్లు ఇష్టారాజ్యంగా పక్కదారి పట్టించినట్లుగా తెలుస్తోంది. ఏదేమైనా టీడీపీ అధికారంలోకి వచ్చాక రేషన్ డీలర్లు గతంలో జరిగిన అవకతవకలు, వాటిని కప్పిపుచ్చుకునేందుకు అధికారుల వద్దకు వెళ్లి చెప్పుకుంటున్నట్లుగా సమాచారం. మరికొందరు ఏకంగా ప్రజలకు పంపిణీ చేసే బియ్యంలో 3 నుంచి 5 కిలోలు తక్కువ ఇచ్చినట్లు, ఇటీవల ఇంకా ఎక్కువగా పెరిగిందని పలువురు వాపోతున్నారు. కొందరు డీలర్లు అధికారులను అడ్డంపెట్టుకుని తక్కువ తూకాలతో మోసగిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. రెండు రోజుల నుంచి కొందరు డీలర్లు టీడీపీ నేతలను అడ్డంపెట్టుకుని మళ్లీ డీలర్‌షిప్ దక్కించుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు రేషన్ డీలర్లపై నిఘా పెట్టాలని ప్రజలకు పంపిణీ చేయకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించిన డీలర్లపై చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. 5, 6 తేదీల్లో రేషన్ డీలర్ల వద్దకు ప్రజలు బియ్యం కోసం వెళితే కొందరు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయలేదని ఆగ్రహించి మాట్లాడినట్లుగా పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

పోరుమామిళ్ల, జూన్ 6: వేసవి విజ్ఞాన శిబిరంలో పోరుమామిళ గ్రంథాలయంలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు విశ్రాంత డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మార్కారెడ్డి, జేవీవీ నేతలు గఫార్, దాదాపీర్ బహుమతులు అందించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో గురువారం 50 మంది విద్యార్థులకు బహుమతులు అందించారు.